

అందంగా..

వెలిగిపోతున్న భవానీ ఐల్యాండ్



- వరదల అనంతరం కొత్తరూపు
- ఐదడుగుల మేర పేరుకున్న ఇసుక
- 90 శాతం పూర్తయిన తొలగింపు పనులు
- త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి..







(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భవానీ ద్వీపానికి ఎట్టకేలకు విముక్తి కలిగింది. భారీ వరదలకు ఇసుక మేటలతో నిండిపోయిన ద్వీపం పునరుద్ధరణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఐదడుగుల ఎత్తున భవానీ ద్వీపాన్ని కప్పేసిన ఇసుకను వందలాది ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. దీంతో భవానీద్వీపం కొత్తరూపాన్ని సంతరించుకుంటోంది. ఇసుక మేటల తొలగింపుతో పాత్‌వేలు బయట పడ్డాయి. జంగిల్ ఏరియాలోని మిగతా 6లో..





కేసరపల్లి నుంచి గన్నవరానికి..

మెట్రో కోచ్ డిపో స్థలం మార్పు

గన్నవరంలో ప్రభుత్వ భూముల గుర్తింపు

రూ.100 కోట్ల వరకు ఖర్చు ఆదా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మెట్రో కోచ్ డిపోకు అవసరమైన భూములను గన్నవరంలో తీసుకోవాలని ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) అధికారులు భావిస్తున్నారు. ముందుగా కేసరపల్లిలో తీసుకోవాలని నిర్ణయించినా, కేసరపల్లిలో ప్రైవేట్ భూముల ధరలు గరిష్టంగా ఉండటం వల్ల గన్నవరంలో ప్రభుత్వ భూములు గుర్తించారు. మెట్రో కోచ్ డిపోకు దాదాపు 60 నుంచి 70 ఎకరాలు అవసరం. కేసరపల్లి దగ్గర భూముల విలువ దాదాపు రూ.100 కోట్లు ఉంటుంది. తాజాగా ఏపీఎంఆర్‌సీ అధికారులు గన్నవరంలో చూసిన భూముల కారణంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి అదనపు ఖర్చు పడదు. రూ.100 కోట్ల మేర ప్రభుత్వానికి ఆదా అవుతుంది. విజయవాడ మెట్రోకు ప్రధానమైన మొదటి కారిడార్ గన్నవరం బస్టాండ్ నుంచి ప్రారంభమవుతుంది. కేసరపల్లిలో కోచ్ డిపో ఏర్పాటు చేస్తే ఇక్కడి నుంచి మళ్లీ గన్నవరం బస్టాండ్ వరకు వెళ్లి తిరిగి వెనక్కి రావాల్సి ఉంటుంది. అదే గన్నవరం అవతల భూములను తీసుకుంటే నేరుగా గన్నవరం బస్టాండ్ నుంచే మెట్రో కోచ్‌లు బయల్దేరే అవకాశముంటుంది. విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టు కోసం మొత్తం 82 ఎకరాల భూములు అవసరం అవుతుండగా, 85 శాతానికి పైగా భూములు ఒక్క కోచ్ డిపోకే కావాలి. ఇవన్నీ ప్రభుత్వ భూములే కావడంతో చాలావరకు ప్రభుత్వంపై ఖర్చు తగ్గినట్టే.

ఐస్‌క్రీమ్‌లో సైనైడ్ కలిపి తిని..

తండ్రీ తనయుల బలవన్మరణం

అప్పుల బాధలు తట్టుకోలేకే..

- ఐస్‌క్రీమ్‌లో సైనైడ్ కలిపి కుమారుడికి తినిపించిన తండ్రి
- తాను కూడా తిని ఆత్మహత్య
- యనమలకుదురులో విషాదం





మృతులు తక్షిల్, సాయిప్రకాశ్‌రెడ్డి (ఫైల్)

పెనమలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కన్నబిడ్డకు గోరుముద్దలు తినిపించాల్సిన ఆ తండ్రి గుండెల్లో బాధను తొక్కిపెట్టి, సైనైడ్ కలిపిన ఐస్‌క్రీమ్‌ను తినిపించి తానూ తిన్నాడు. తన కష్టాలు తనయుడికి కలగకూడదనుకున్నాడో ఏమో తన వెంటే తనయుడ్ని కూడా తీసుకెళ్లిపోయాడు. హృదయవిదారకమైన ఈ విషాద సంఘటన యనమలకుదురులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. వన్‌టౌన్‌లో బంగారం పనులు చేసే సాయిప్రకాశ్ రెడ్డి భార్య, పిల్లలతో యనమలకుదురు వినోద్ పబ్లిక్ స్కూల్ రోడ్డులో ఉంటున్నాడు. భార్య లక్ష్మీభవాని గాంధీనగర్‌లోని ఓ మెడికల్ షాపులో పనిచేస్తోంది. వారికి 11 ఏళ్ల పాప, ఏడేళ్ల బాబు తక్షిల్ సంతానం. కరోనా సమయంలో సరిగ్గా వ్యాపారం, పనులు లేక రూ.10 లక్షల వరకు అప్పయ్యాడు. వాటిని ఎలా తీర్చాలో తెలియక కొద్దిరోజులుగా మనస్తాపానికి గురవుతున్నాడు. భార్య సముదాయించినా లోలోపల కుమిలిపోతూనే ఉన్నాడు. కాగా, బుధవారం భార్యాభర్తలు ఎవరి పనులకు వారు వెళ్లి మధ్యాహ్న సమయంలో ఇంటికి వచ్చారు. ఒంటిపూట బడులు మిగతా 6లో..

అదిగదిగో..

ఆశల వారధి కళ్ల ముందు సాక్షాత్కరిస్తోంది. దశాబ్దాల కల త్వరలో నిజం కాబోతోంది. దివిసీమలోని ఎన్నో దీవులకు వెలుగుదారి పరిచే ఏటిమొగ్గ-ఎదురుమొండి వారధి నిర్మాణం అతి త్వరలో ప్రారంభం కానుంది. నిధులున్నా ఇన్నాళ్లూ నీటి మీద రాతలుగానే మారిన వారధి నిర్మాణ ప్రతిపాదనలు టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో పునరుత్తేజం తెచ్చుకుని టెండర్ల దశను దాటడంపై దివిసీమవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆశల వారధి

ఏటిమొగ్గ-ఎదురుమొండి వంతెన నిర్మాణానికి తొలి అడుగు

రూ.109 కోట్లతో త్వరలో ప్రారంభంకానున్న పనులు

- టెండర్ దక్కించుకున్న వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్
- త్వరలోనే పనులు చేపట్టే అవకాశం
- నిధులున్నా వైసీపీ హయాంలో మూలనపడిన ప్రాజెక్టు
- టీడీపీ కూటమి రాకతో మళ్లీ టెండర్లు.. ఖరారు
- ఆనందం వ్యక్తం చేస్తున్న దివిసీమవాసులు



ఎదురుమొండి దీవులకు వెళ్లేందుకు ఎదురుచూస్తున్న ప్రయాణికులు



అవనిగడ్డ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో దశాబ్దాలుగా ఎదురుమొండి దీవుల వాసులు ఎదురుచూస్తున్న కల త్వరలో సాకారం కానుంది. రూ.109 కోట్లతో త్వరలో వారధి నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయి. ఈ దీవుల్లోని దాదాపు 10 వేల మంది బాహ్య ప్రపంచానికి వెళ్లాలంటే పడవలు, పంటు మాత్రమే దిక్కు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో ఆ వెసులుబాటు కూడా లేక ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుమొండి నుంచి ఏటిమొగ్గ వరకు వంతెన నిర్మిస్తే తమ కష్టాలు తీరతాయని అక్కడి ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఇంతకాలం ఈ వారధి అంశం ఎన్నికల స్టంట్‌గానే మిగిలిపోతూ వచ్చింది. 2023లో వారధి నిర్మాణానికి నాబార్డు రూ.109 కోట్లు కేటాయించగా, రెండుసార్లు టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాలేదు. తాజాగా ఆర్అండ్‌బీ మూడోసారి గ్లోబల్ టెండర్లు పిలవగా, వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్ దక్కించుకుంది. ఇప్పటికే అగ్రిమెంట్ పనులు పూర్తికావటంతో త్వరలోనే ఎదురుమొండి దీవులవాసులు వారధి కోసం కంటున్న కలలు సాకారమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పడవ ప్రమాదాలతో భయంభయంగా..

ఎదురుమొండి దీవుల్లోని మూడు పంచాయతీల్లో ఉన్న ప్రజలు ఏ కొదిపాటి అవసరం ఏర్పడినా ప్రమాదకరమైన పడవ ప్రయాణం చేయాల్సిందే. ఇలా పడవ దాటుతున్న సమయంలో 2002వ సంవత్సరంలో గొల్లమంద వద్ద జరిగిన ప్రమాదంలో దాదాపు 28 మంది మృతిచెందగా, అంతకు రెండు దశాబ్దాల ముందు 30 మంది నదిలో మునిగి చనిపోయారు. ఈ పరిస్థితిని గమనించిన నాటి టీడీపీ ప్రభుత్వం ఏటిమొగ్గ నుంచి ఎదురుమొండి వెళ్లేందుకు ప్రజా భాగస్వామ్యంతో మిగతా 6లో..

టీడీపీ కూటమి వచ్చాక..

టీడీపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం నాబార్డు మంజూరు చేసిన రూ.109 కోట్లతో వారధి నిర్మాణానికి టెండర్లు పిలవటంతో పాటు కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనేందుకు ఒప్పించింది. దీంతో ఇటీవల పిలిచిన గ్లోబల్ టెండర్లలో పలువురు ఈ పనులు చేపట్టేందుకు ముందు కొచ్చారు. వారిలో నుంచి వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఈ పనులు దక్కించుకోవటంతో త్వరలోనే పనులు ప్రారంభమవుతాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా, వారధి నిర్మాణానికి టెండర్లు ఖరారు కావటంతో పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్. ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ నయీమూల్లాను కలసి కృతజ్ఞతలు తెలిపారు.

సరిహద్దుల్లో స్థావరాలు

కాకినాడ టూ గన్నవరం ఐపీఎల్ బెట్టింగ్

- పోలీసుల అదుపులో ఎనిమిది మంది
- రూ. 2.90 లక్షలు, ఇతర వస్తువులు సీజ్
- కాకినాడలోని ప్రధాన బుకీ పరార్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లో ప్రధాన బుకీలు, సబ్ బుకీలకు కృష్ణాజిల్లా కేంద్రంగా మారుతోంది. సరిగ్గా సరిహద్దుల్లో పాగా వేసిన బుకీలు ఐపీఎల్‌లో పందేలను పరుగులు తీయిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం అవనిగడ్డకు చెందిన ఐదుగురు బుకీలు, పంటర్లను విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తాజాగా గన్నవరం కేంద్రంగా బెట్టింగ్‌లను జోరుగా నిర్వహించిన ఎనిమిది మంది గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. బుకీలను పట్టుకున్న తర్వాత దర్యాప్తు చేస్తున్న పోలీసులకు కొత్తకొత్త విషయాలు తెలుస్తున్నాయి. జిల్లాలో మండల, గ్రామీణ స్థాయిలో సబ్ మిగతా 6లో..

కాకినాడతో ప్రధాన బంధం

కిరణ్, కొసరాజు వెంకట సూర్యారావుకు కాకినాడకు చెందిన ఓ వ్యక్తితో సంబంధాలు ఉన్నాయని పోలీసులు గుర్తించారు. అతడిని పట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తుండగా, ఆ వ్యక్తి సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసి పరారైనట్టు సమాచారం. పోలీసులు గాలిస్తున్నారు.

అసౌకర్యాల ఆవాసాలు



మచిలీపట్నం మండలం రుద్రవరంలో లే అవుట్‌లో అంతర్గత రహదారుల దుస్థితి

జగనన్న లే అవుట్లలో కనీస సౌకర్యాలు మృగ్యం

- కొన్నిచోట్ల ఇళ్లు నిర్మించినా రహదారులు లేవు
- మెరక పనుల్లో నాటి వైసీపీ నేతల చేతివాటం
- తూతూమంత్రంగా పనులు.. నేడు అవస్థలు
- వర్షం పడితే కాలు బయటపెట్టలేని పరిస్థితి
- జిల్లాలో 665 లే అవుట్లలో ఇదే దుస్థితి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని 665 లే అవుట్లలో 86,084 ఇళ్లు నిర్మిస్తామని గత వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. కొందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చింది. ఇందులో ఇప్పటివరకు 28,456 ఇళ్లు నిర్మించారు. 29,080 ఇళ్ల నిర్మాణం ఇంకా ప్రారంభమే కాలేదు. 28,548 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే, ఇప్పటికే ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నవారు కాలు బయటపెట్టాలంటే భయపడిపోతున్నారు. ఈ లే అవుట్లలో మెరక పనులు సక్రమంగా చేయలేదు. తూతూమంత్రంగా చేసి బిల్లులు పెట్టుకున్నారు. ఈ కాలనీల్లో అంతర్గత రహదారుల పనులు చేయించే బాధ్యత అప్పట్లో పంచాయతీరాజ్ విభాగానికి అప్పగించారు. గన్నవరం, తదితర మండలాల్లోని లే అవుట్లలో రహదారుల నిర్మాణ పనులు చేసినా బిల్లులు మంజూరు కాకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించారు.

అంతర్గత రహదారులు లేక ఇబ్బందులు

జగనన్న లే అవుట్లలో అంతర్గత రహదారులు నిర్మించకపోవడంతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. మచిలీపట్నం మండలం రుద్రవరంలో ఏర్పాటుచేసిన రెండు లే అవుట్లలో సగానికి పైగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ లే అవుట్లలో రూ.1.50 కోట్లతో మెరక పనులు చేశామని బిల్లులు కూడా చేసుకున్నారు. కానీ, పనులు సక్రమంగా చేయలేదు. ఇళ్ల మధ్య రహదారులకు సంబంధించి మిగతా 6లో..

జగనన్న లే అవుట్లలో కనీస సౌకర్యాలు లేక నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 665 లే అవుట్లలో సెంటు, సెంటున్నర భూమి చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా అధికశాతం లబ్ధిదారులకు నేటికీ వారికి కేటాయించిన స్థలం ఎక్కడుందో తెలియదు. తమ స్థలం ఎక్కడుందో తెలుసుకుని, ఇళ్లు నిర్మించుకున్న వారికి కనీస సౌకర్యాలు కల్పించలేదు. దీంతో జిల్లాలోని చాలా లే అవుట్లలో నివాసితులు పడరాని పాట్లు పడుతున్నారు.

హైదరాబాద్ టు విజయవాడ..

మాంసం వ్యర్థాల అక్రమ రవాణా!



- రెండు జిల్లాల చేపల చెరువులకు యజమానుల దిగుమతి
- రోజూ హైదరాబాద్ నుంచి విజయవాడ మీదుగా 50 లారీలు
- వినియోగంపై నిషేధం ఉన్నా బేఖాతరు.. చర్యలు శూన్యం

6లో



కష్టకాలం!

- కోత కూలీ, రవాణా ఖర్చులు రాక.. గిట్టుబాటు ధరలేక పంట ధ్వంసం
- మొక్కలు తొలగిస్తున్న రైతులు



నిరంజనానందకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామచంద్ర

దుర్గమ్మ సేవలో స్వామి నిరంజనానంద

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను గురువారం సత్యానంద యోగాశ్రమం పీఠాధిపతి స్వామి నిరంజనానంద దర్శించుకున్నారు. దేవదాయ కమిషనర్, ఈవో రామచంద్రమోహన్, స్థానాచార్యుడు శివప్రసాదశర్మలు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనం.. ఈవో అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.



తెలంగాణ, ఏపీ ఎన్నికల కమిషనర్లు రాణి కుముదిని, నీలం సాహ్నిలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న అర్చకులు, ఏఈవో

దుర్గమ్మను దర్శించుకున్న ఎన్నికల కమిషనర్లు

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లు నీలం సాహ్ని, రాణి కుముదినిలు గురువారం దర్శించుకున్నారు. స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్, ఏఈవో చంద్రశేఖర్‌లు వారికి సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం, ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

- సత్యనారాయణపురానికి చెందిన మాల్యాద్రి గురువారం కుటుంబసభ్యులతో కలిసి అన్నవితరణకు రూ1,11,116 విరాళం అందజేశారు.
- దుర్గగుడిలో చైత్రమాస బ్రహ్మోత్సవాల క్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి 10.30 గంటలకు గంగాపార్వతి,మల్లేశ్వరుల దివ్య లీలా కల్యాణోత్సవం జరగనున్నది. అంతకుముందు 7.30 గంటలకు ఎదుర్కోల ఉత్సవం జరుగుతుంది. ప్రముఖ కవి, పండితులు దుర్గామల్లేశ్వరుల వైభవం తదితరాల గురించి వర్ణిస్తారు.



సొసైటీ భవనంలో అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కొండపల్లి బొమ్మ ఖ్యాతిని చాటి చెప్పాలి

» ఎక్స్‌పీరియన్స్ సెంటర్ సందర్శనలో కలెక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : హస్త కళాకారుల చేతుల నుంచి జీవం పోసుకుంటూ దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కొండపల్లి బొమ్మ ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటి చెప్పేలా వన్నె తగ్గని సృజనాత్మక సంపదను భావి తరాలకు అందించేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేయనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. గురువారం ఆయన పలుశాఖల అధికారులతో కలిసి కొండపల్లిలో పర్యటించారు. హస్తకళాకారుల సొసైటీ భవనాన్ని పరిశీలించి చేపట్టాల్సిన పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందేందుకు అపార అవకాశాలున్నాయన్నారు. భౌగోళిక, ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక ఔన్నత్యమున్న జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్యాకేజీలను రూపకల్పన చేసినట్టు తెలిపారు. దీనిలో భాగంగా శతాబ్దాల చారిత్రక వారసత్వానికి సజీవ సాక్ష్యంగా ఉన్న కొండపల్లి బొమ్మ విశిష్టతను పర్యాటకులకు చాటిచెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. సొసైటీ భవనంలో మౌలిక వసతులను అభివృద్ధి చేసి, సుందరీకరణ పనులు చేపట్టి ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. బొమ్మ చారిత్రక వైభవం, బొమ్మల తయారీకి ఉపయోగించే తెల్లపొణికి చెక్క, అత్యంత ప్రాచుర్యం పొందిన బొమ్మలు తదితర విశేషాలను కళాకారులు కళ్లకు కట్టినట్టుగా ప్రత్యేక అనుభూతి పొందేలా పర్యాటకులకు వివరించేందుకు ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. కొండపల్లి పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లాపర్యాటక అధికారి శిల్ప, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన తదితరులు పాల్గొన్నారు.

50శాతం రాయితీతో విద్యుత్ లోడు క్రమబద్ధీకరించుకోండి

» ట్రాన్స్‌కో ఏఈ దేవదాసు

తోట్లవల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు విద్యుత్ లోడును జూన్ 30లోగా స్వచ్ఛందంగా క్రమబద్ధీకరణ చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ దేవదాసు కోరారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ, సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్(సీపీడీసీఎల్) వినియోగదారులకు భారం తగ్గించే విధంగా 50శాతం రాయితీని ప్రకటించిందని, దీనికి ఈ ఏడాది జూన్ 30 వరకు మాత్రమే గడువు ఉందన్నారు. ఎవరు ఎంత లోడు వినియోగించుకుంటున్నారో తెలియజేస్తే అందుకు తగ్గట్టుగా ఆయా ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌పార్మర్‌లు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్ అందించే అవకాశం తమకు కలుగుతుందన్నారు. 1 కిలో వాట్‌కి అసలు ధర రూ. 2,250 ఉందని, 50 శాతం రాయితీ కింద రూ 1,250 తగ్గింపు అవకాశాన్ని కల్పించినట్టు ఏఈ వివరించారు. ప్రతివినియోగదారుడు స్వచ్ఛందంగా అదనపు లోడుని క్రమబద్ధీకరించుకోవాలన్నారు. జూన్ 30 తరువాత తమ సిబ్బంది ఇంటింటికి వచ్చి తనిఖీల్లో అదనపు లోడు గుర్తిస్తే 100 శాతం చెల్లించాల్సిందేనని చెప్పారు.

అదిగదిగో.. ఆశల వారధి

(5వ పేజీ తరువాయి)

పంటును ఏర్పాటు చేయగా, అప్పటి నుంచి దానిపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే, రాత్రి 7 గంటల తర్వాత పంటు సౌకర్యం లేకపోవటంతో ఏ అనారోగ్య సమస్య వచ్చినా విధిలేని పరిస్థితిలో నాటు పడవలపైనే నది దాటాల్సి వచ్చేది. ఈ పరిస్థితి నుంచి తాము గట్టెక్కాలంటే ఎదురుమొండి-ఏటిమొగ గ్రామాల నడుమ నదిపై వంతెన నిర్మించడం ఒక్కటే మార్గమని ప్రజల నుంచి బలమైన డిమాండ్ రావడంతో నేతలు రెండు దశాబ్దాలుగా హామీలు ఇస్తూనే వస్తున్నారు.

వైసీపీ హయాంలో..

2023వ సంవత్సరంలో నాటి ఎంపీ బాలశౌరి నాబార్డు అధికారులతో మాట్లాడి రూ.109 కోట్లు కేటాయించేలా చేశారు. నాడు ఉన్న పరిస్థితుల్లో కాంట్రాక్టర్లు ఎవరు ఈ పనులు చేయటానికి ముందుకు రాలేదు. 2018లో చంద్రబాబు ప్రభుత్వం ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సహకారంతో వారధి నిర్మాణం చేపడతామని ప్రకటించినప్పటికీ ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ రావటం, నాటి ప్రభుత్వ తీరు కారణంగా ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ బ్యాంక్ తన కార్యకలాపాలు నిర్వహించలేమంటూ ప్రధాని కార్యాలయానికి లేఖ రాసి, వైదొలగింది.



దడ పుట్టిస్తోన్న పసిడి!

» ఒక్కరోజే 3 వేలు పెరిగిన ధర
» సామాన్య, మధ్య తరగతికి అందని ద్రాక్షలా..
» ఈ నెలలో పెళ్లి ముహుర్తాలపై ఆశలు
» వ్యాపారాలపై తీవ్ర ప్రభావం

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

'అక్కా బంగారం కొనాలి షాపుకు వెళదాం వస్తావా.. పక్కింటి ఆవిడ దగ్గరకు వెళ్లి అడిగింది బంగారం కొనాల్సిన మహిళ! ఇప్పుడెందుకమ్మా ధరలు బాగా ఉన్నాయిగా.. అయినా తప్పదు.. మా బంధువుల ఇంట్లో శుభాకార్యం. వారు తులం రూ.30 వేలు ఉన్నపుడు పెట్టారు. ఇప్పుడు రూ. 85 వేలకు చేరింది.. ఏం చేస్తాం..! పెట్టాలిగా.' బంగారం ధరలపై సామాన్య, మధ్య తరగతి వాళ్ల మధ్య సంభాషణ ఇది. బంగారం కొందామా.. లక్షకు చేరుతుందంటా.. ఇపుడే కొంటే పోలా.. మొన్న వరుసగా రెండ్రోజులు తగ్గింది.. మళ్లీ తగ్గుతుందేమో అప్పుడు కొందాం.. పసిడి ప్రియుల మధ్య సందిగ్ధధోరణి!

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో సామన్య, మధ్యతరగతి వర్గాలు పసిడి పరుగుపై ఆందోళన చెందుతున్నాయి. రెండ్రోజుల క్రితం తగ్గినట్టే తగ్గిన ధర గురువారం రికార్డు స్థాయిలో పెరిగిపోయింది. బుధవారం 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.90,440లు ఉండగా గురువారం రూ.93,380లకు చేరింది. 22 క్యారెట్ల తులం బంగారం ధర బుధవారం రూ.82,900 ఉండగా గురువారం రూ.85,600లకు చేరుకుంది. అంతర్జాతీయ బులియన్ మార్కెట్ దేశంలో బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి బంగారం ఇప్పటికే 17సార్లు ఆల్‌టైమ్ రికార్డును తాకింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బంగారు ఆభరణాల దిగుమతులపై సుంకాలు విధించడంతో పసిడి పరుగులు తీస్తోంది. దీంతో బంగారం కోనేవారి సంఖ్య తగ్గింది. మరోవైపు ఏప్రిల్‌లో పెళ్లి ముహూర్తాలు ఉండటంతో బంగారం కొనక తప్పని పరిస్థితి. మొత్తం మీద బంగారం ధరల విషయంలో ప్రజలు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.

పెట్టిపోతలకు తప్పడంలేదు



- సుంద్రా తిరుపతమ్మ, కూనపరాజుపర్వ, రెడ్డిగూడెం

తాళిబొట్టు కొనుగోలు కోసం వచ్చాం. అదిరిపోయే ధర ఉంది. కాసు కూడా కొనేలా లేదు. రెండ్రోజుల క్రితం 2వేలు తగ్గింది. మరింత తగ్గుతుందని ఆశించాం. తగ్గకపోగా 3 వేలు పెరిగింది. ఇలా అయితే బంగారం కొనలేం. అలాగని మానుకోలేం. శుభకార్యాలలో అప్పు చేసయినా వస్తువు పెట్టాల్సిన పరిస్థితి.

ధరలు తగ్గితే బాగుంటుంది



- జి.శ్రీరామ్ ఎ.కొండూరు, కుమ్మరికుంట్ల

ధరలు సామాన్యులు అందుబాటులో లేవు. సోదరుడి పెళ్లి ఉంది. 10 కాసులతో వస్తువు పెడదాం అనుకున్నా. ధర పెరగడంతో కేవలం ఆరేడు కాసులు మాత్రమే ఆర్డర్ ఇచ్చాను. పెట్టిపోతలకు బంగారం కొనక తప్పని పరిస్థితి.

వ్యాపారాలపై తీవ్ర ప్రభావం

- కుక్కడపు వెంకట నాగేశ్వరరావు, వ్యాపారి

గ్రామాల్లో ఎక్కువగా పేద, మధ్య తరగతి వారే బంగారం కొనుగోలు చేస్తుంటారు. ధరలు పెరగడం వల్ల పదికాసులు కొనే వారు ఐదారు కాసులు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మూడు నెలల నుంచి ధరలు పెరుగుతూ ఉండటంతో వ్యాపారాలు లేవు. వినియోగదారుడు ఆర్డర్ ఇచ్చినప్పుడు ధర తక్కువగా ఉండి, వస్తువు తీసుకునే సమయానికి ధర పెరడం వల్ల నష్టాలు తప్పడం లేదు. మూడు నెలలు నష్టాలు భరించాం. పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో వ్యాపారాలు బాగుంటాయేమో చూడాలి.







పొలంలో కాయలతోనే పెకలించి వేసిన టమాటా మొక్కలు

కష్ట కాలం!

» కోత కూలీ, రవాణా ఖర్చులు రాక.. గిట్టుబాటు ధరలేక పంట ధ్వంసం
» మొక్కలు తొలగిస్తున్న రైతులు

ఉయ్యూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కోత కూలీ, రవాణ ఖర్చు కూడా రాని పరిస్థితుల్లో చేసేదిలేక పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టి పండించిన టమాటా పంటను రైతులు ధ్వంసం చేస్తున్నారు. చిన ఓగిరాల, పెదఓగిరాల, ఆకునూరు, గండిగుంట పరిధిలో పదుల ఎకరాల్లో టమాటా సాగుచేసిన రైతులకు గిట్టుబాటు ధర లేక మొక్కలు తొలగిస్తున్నారు. మరో పంటవేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల అకాలవర్షాలకు టమాట రంగు రాక తెల్లగా ఎండిపోతున్న పరిస్థితుల్లో కిలో ఐదు రూపాయలకు కూడా కొనేవారులేక పొలంలో మొక్కలు తొలగిస్తున్నారు. దీనికితోడు మదనపల్లి, చిత్తూరు పరిసర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్న టమాటాతో పోటీ ఎక్కువగా ఉంటోందని అందువల్ల ఇక్కడి టమాట రైతులు నష్టపోవాల్సి వస్తున్నదని ఆందోళన చెందుతున్నారు. లక్షలకు పైగా ఖర్చు పెట్టామని దిక్కు తోచని పరిస్థితుల్లో పంట తీసివేయాల్సి వస్తున్నదని వాపోతున్నారు.

పెట్టిన పెట్టుబడీ రాలేదు

- వల్లభనేని రామకృష్ణ, చినఓగిరాల

ఎకరం పొలంలో టమాటా సాగుచేసి లక్షకు పైగా ఖర్చు చేశా. పెట్టిన పెట్టుబడి కూడా రాక ధర గిట్టుబాటు కాక మొక్కలు తొలగించాల్సి వచ్చింది. పంట దిగుబడి కోసం ఆధునిక పద్ధతిలో సాగు చేసినప్పటికి ఫలితం లేకపోయింది. టమాటా కొనే వారు లేరు. కోత కూలీ, రవాణా ఖర్చులు కూడా రాలేదు. మదనపల్లి నుంచి వచ్చే టమాటతో పోటీకి తట్టుకోలేక పంట సమయం ఇంకా ఉన్నప్పటికి తొలగించి మరో పంట సాగుచేయాలను కుంటున్నా.

అసౌకర్యాల ఆవాసాలు

(5వ పేజీ తరువాయి)

పనులు చేయనేలేదు. దీంతో ఈ కాలనీలో నివాసం ఉంటున్నవారు ఇళ్లలోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో కొద్దిపాటి వర్షానికే అంతర్గత రహదారులు బురదగా మారుతున్నాయి. రుద్రవరం లే అవుట్‌కు సమీపంలోని గుండుపాలెం పల్లెపాలెంలో ఇళ్ల స్థలాలుగా ఇచ్చిన భూమి పల్లపు ప్రాంతంలో ఉంది. ఈ లే అవుట్‌లో మెరక సక్రమంగా చేయకుండానే వైసీపీ నాయకులు బిల్లులు చేసుకున్నారు. ఈ లే అవుట్ వద్ద ఇళ్ల నిర్మాణం నిమిత్తం ఇటుకలు, ఇసుక, కంకర, ఇతరత్రా మెటీరియల్‌ను ట్రాక్టర్లలో సైతం తీసుకెళ్లేందుకు అవకాశంలేని పరిస్థితి ఏర్పడింది. కరగ్రహారంలోని లే అవుట్‌లో 16 వేల మందికి సెంటు భూమి చొప్పున ఇచ్చారు. ఇక్కడ అంతర్గత రహదారులకు సంబంధించి ఒక్క పని కూడా జరగలేదు. గన్నవరం మండలం కేసరపల్లి లే అవుట్‌కు వెళ్లేందుకు రూ.3 కోట్లతో ఏడాదిన్నర కాలం క్రితం వంతెన నిర్మాణానికి అనుమతులు వచ్చాయని ప్రచారం చేశారు. ఇంతవరకు ఈ వంతెన పనులు ప్రారంభించలేదు. ఇక్కడ ఎకరం రూ.70 లక్షలకు పైగా చెల్లించి మరీ 60 ఎకరాలు కొని లే అవుట్ వేశారు. 3,400 మందికి స్థలాలు ఇచ్చారు. ఈ లే అవుట్‌కు వెళ్లే దారికోసం వంతెన నిర్మాణాన్ని మాత్రం పక్కన పెట్టేశారు. దీంతో ఇక్కడ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని లే అవుట్లలో అంతర్గత రహదారులను మెరక చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ తరచూ అధికారులకు సూచిస్తున్నా, ఆ దిశగా అంచనాలు కూడా తయారు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ప్రతిపాదనలు లేవ్..!

జిల్లాలోని జగనన్న లే అవుట్లలో అంతర్గత రహదారులను అభివృద్ధి చేసేందుకు ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదనలు, అంచనాలు తయారు చేయలేదని పంచాయతీరాజ్ విభాగం అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అంచనాలు తయారుచేసి పనుల కోసం టెండర్లు పిలిచినా, కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని, దీంతో ఈ పనులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటున్నారు. బిల్లులు సకాలంలో రాకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు కోర్టులను ఆశ్రయించారని, దీంతో ఈ కేసులకు సంబంధించిన వాయిదాల నిమిత్తం కోర్టుల చుట్టూ తిరుగుతున్నామంటున్నారు. స్థలాలు ఇచ్చేందుకు భూమి కొనుగోలు, మెరక పనులు వైసీపీ నాయకులు సక్రమంగా చేయకపోవడం తదితర అంశాలపై పలు లే అవుట్లలో జరిగిన అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వం విజిలెన్స్ అధికారులతో విచారణ చేయిస్తోంది. ఈ లెక్కలన్నీ ఎప్పటికి కొలిక్కివస్తాయి.. ఎప్పటికి అంతర్గత రహదారుల పనులు చేస్తారనే అంశం సందిగ్ధంగా మారింది. ఈ వేసవిలోనైనా లే అవుట్లలో అంతర్గత రహదారులను కనీసంగానైనా మెరక చేయించాలని నివాసితులు కోరుతున్నారు.

సరిహద్దుల్లో స్థావరాలు

(5వ పేజీ తరువాయి)

బుకీలు, ప్లంటర్లకు పెద్ద నెట్‌వర్క్ నడుస్తున్నట్టు గుర్తించారు.

'రాధే'లో రయ్‌రయ్..

గన్నవరంతోపాటు మండలంలోని అల్లాపురం, అజ్జంపూడి గ్రామాల్లో ఉన్న బుకీల నెట్‌వర్క్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బట్టబయలు చేశారు. పటమట పోలీసు స్టేషన్ పరిధిలోని సరిహద్దులకు వచ్చి బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న సబ్ బుకీని అదుపులోకి తీసుకోగా, గ్యాంగ్ అసలు బాగోతం బయటపడింది. ఈ గ్యాంగ్‌కు సూత్రధారి కాకినాడకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడు తయారు చేయించిన రాధే ఎక్స్ఛేంజ్ యాప్‌లో మొత్తం బెట్టింగ్ వ్యవహారం నడుస్తున్నట్టు నిర్ధారించారు. ఈ యాప్‌ను గన్నవరంలోని అల్లాపురానికి చెందిన కిరణ్, అజ్జంపూడికి చెందిన కొసరాజు వెంకట సూర్యారావును భాగస్వాములుగా తీసుకున్నారు. కిరణ్‌కు మచిలీపట్నంలో బంగారం పూత పనిచేసే కేతవరపు భానుప్రకాష్ బావమరిది. మచిలీపట్నంలో పనిలేకపోవడంతో కిరణ్ అతడిని గన్నవరం రప్పించుకున్నాడు. భాగస్వామిగా ఉన్న వెంకట సూర్యారావుతో భానుప్రకాష్‌కు లైన్ ఇప్పించాడు. భానుప్రకాష్. ఎనికేపాడు సమీపంలోని ఓ పాఠశాల నుంచి బెట్టింగ్ నిర్వహిస్తుండగా, పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అతడి ఫోన్ ద్వారా ఒక్కో లింక్‌ను ఛేదించుకుంటూ వెళ్లిన పోలీసులు కిరణ్, అతడికి బెట్టింగ్ డబ్బును వసూలుచేసే బోస్ అనే వ్యక్తిని, బెట్టింగ్ ఆడుతున్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఇందులో కిరణ్‌కు భాగస్వామిగా ఉన్న కొసరాజు వెంకట సూర్యారావు.. పోలీసులను చూసి రెప్పపాటు వ్యవధిలో పరారయ్యాడు. వీరే కాకుండా గన్నవరంలో ఈ రాధే యాప్‌తో అనుసంధానమైన మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. యాప్‌లో ఉన్న ఖాతాలో మొత్తం రూ.2.90 లక్షలవరకు ఉన్నట్టు గుర్తించారు. వారి దగ్గర నుంచి ఓ ల్యాప్‌టాప్, 18 సెల్‌ఫోన్లు, రూ.12,000 స్వాధీనం చేసుకున్నారు. యాప్ ఖాతాలో ఉన్న నగదును స్తంభింప చేయించారు.

తండ్రీ తనయుల బలవన్మరణం

(5వ పేజీ తరువాయి)

కావడంతో పిల్లలు ఇంట్లోనే ఉన్నారు. తల్లి లక్ష్మీభవానీ తిరిగి మెడికల్ షాపునకు వెళ్లిపోయింది. కాగా, సాయంత్రం 4.30 గంటల సమయంలో సాయిప్రకాశ్‌రెడ్డి.. కుమారుడు తక్షిల్‌కు సైనైడ్ కలిపిన ఐస్‌క్రీమ్ తినిపించి తానూ తిన్నాడు. కాసేపటికే ఇద్దరూ అపస్మారక స్థితికి వెళ్లిపోయారు. స్థానికులు గమనించి వారిద్దరినీ పటమటలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం బుధవారం రాత్రి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ఇద్దరూ మృతిచెందినట్టు తెలిపారు. సైనైడ్ సేవించే ముందు సాయిప్రకాశ్‌రెడ్డి తన స్నేహితుడు విజయ్‌కు ఇద్దరం సైనైడ్ తిన్నామని, క్షమించమని మెసేజ్ పెట్టాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అందంగా..

(5వ పేజీ తరువాయి)

మిర్రర్ మేజ్, మేజ్ గార్డెన్, రోబోటిక్ పార్క్ వంటి వాటి దగ్గర కూడా ఇసుకను తొలగించి అభివృద్ధి చేశారు. మేజ్ గార్డెన్ ఏరియాలో చాలావరకు ఇసుక తొలగించినా.. మొక్కల మధ్యన ఉన్న పాత్‌వేలపై ఇసుక మేట వేయడంతో అక్కడ పనులు చేపట్టారు. కాగా, ఇటీవల ద్వీపాన్ని ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ సందర్శించారు. ఇదే సందర్భంలో కొత్తగా ఈడీగా ఉమామహేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన నేతృత్వంలోనే ఈ అభివృద్ధి పనులు జరిగాయి. మరో 10 శాతం తొలగింపు పనులే మిగిలి ఉన్నాయి. ఇప్పటికే పర్యాటకుల రాకపోకలు మొదలు కాగా, వారంలో మేజ్ గార్డెన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. మ్యూజికల్ ఎక్విప్‌మెంట్లు, చిన్నారుల ఆటస్థలం, ఫౌంటేన్లు, సెల్ఫీ పాయింట్స్ అన్నీ బయటపడ్డాయి. బోటింగ్ పాయింట్ వద్ద పేరుకుపోయిన ఇసుక మేటలను కూడా పూర్తిగా తొలగించారు.



లారీ నుంచి పడిన మాంసం వ్యర్థాలను తరలిస్తున్న సిబ్బంది

హైదరాబాద్ టు విజయవాడ..

మాంసం వ్యర్థాల అక్రమ రవాణా!



» ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల చేపల చెరువులకు యజమానుల దిగుమతి
» ప్రతిరోజూ హైదరాబాద్ నుంచి విజయవాడ మీదుగా 50 లారీలు
» వినియోగంపై నిషేధం ఉన్నా బేఖాతర్.. ఆ చేపలు తింటే తీవ్ర అనారోగ్యం
» పట్టించుకునే వ్యవస్థలు.. చర్యలు శూన్యం

(ఆంధ్రజ్యోతి, నందిగామ/విస్సన్నపేట) : దొరికితేనే దొంగలు.. పాపం పండటంతో మాంసం వ్యర్థాల రాకెట్ గుట్టు రట్టయింది. హైదరాబాద్ నుంచి ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని సిండికేట్లతో కలిసి భారీగా మాంసం వ్యర్థాలను డంప్ చేస్తున్నాయి. ఇన్నాళ్లూ గుట్టుగా చేస్తున్న అక్రమ వ్యాపారం లారీ ప్రమాదంతో వెలుగుచూసింది. విస్సన్నపేట మండలం చంద్రుపట్లలో మాంసం వ్యర్థాలు తరలిస్తున్న లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి పల్టీ కొట్టడంతో అసలు కథ వెలుగులోకి వచ్చింది. ఖమ్మం జిల్లా నుంచి జాతీయ రహదారి మీదుగా, అడ్డదారుల్లో వస్తున్న మాంసం వ్యర్థాల లారీలు యథేచ్ఛగా ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. చేపలు వెంటనే పెరగటానికి చెరువుల్లో మాంసపు వ్యర్థాలను వేస్తూ ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణ విధ్వంసానికి ఆక్వాసాగు యజమానులు పాల్పడుతున్నారు.

చేపల చెరువుల్లో మాంసపు వ్యర్థాల వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ మత్స్యశాఖ అధికారులు వారిని అడ్డుకోవడం లేదు. గ్రామాల్లో ఊరచెరువుల నుంచి పంట పొలాలలో ఏర్పాటు చేస్తున్న చెరువుల వరకూ మాంసపు వ్యర్థాలను వినియోగిస్తున్నారు. హైదరాబాద్, ఖమ్మం నగరాల నుంచి నిత్యం 50 లారీలకు పైగా అక్రమంగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. బోర్డర్ చెక్‌పోస్టులు, టోల్‌ప్లాజాల వద్ద సరైన తనిఖీలు నిర్వహించకపోవడంతో అక్రమ వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. వ్యర్థాల ఆనవాళ్లు కనిపించకుండా ప్లాస్టిక్ బ్యాగ్‌ల్లో పెట్టి లోడ్ చేస్తారు. వ్యర్థాల తాలూకా నీరు కింద పడకుండా లారీ అడుగు భాగాన ప్లాస్టిక్ పట్టాలు పరిచి జాగ్రత్త పడుతున్నారు. మరి కొందరు ఏసీ కంటైనర్ల ద్వారా వ్యర్థాలను దిగుమతి చేసుకుంటున్నారు. చికెన్, మటన్ దుకాణాల నుంచి కిలో రూ.3 చొప్పున వ్యర్థాలను సేకరిస్తున్న వ్యాపారులు చేపల చెరువులకు చేరవేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మొత్తం విజయవాడకు చెందిన ఒక మాఫియా కనుసన్నల్లో జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. భారీఎత్తున సాగుతున్న అక్రమ వ్యాపారానికి పోలీసులు, మత్స్యశాఖ అధికారుల సహకారం ఉన్నట్టు విమర్శలు ఉన్నాయి.

ఎక్కడికక్కడే డంపింగ్ యార్డులు

హైదరాబాద్, ఖమ్మం పట్టణాల నుంచి రాష్ట్రంలోకి వస్తున్న వ్యర్థాలను చేపల చెరువులకు దిగుమతి చేస్తున్నారు. జిల్లాలోని నందిగామ పట్టణం బైపాస్ రోడ్డులో సంచులను ఆటోలకు దిగుమతి చేస్తున్నారు. అక్కడి నుంచి ఆటోల ద్వారా చందర్లపాడు, నందిగామ, పెనుగంచిప్రోలు మండలాలోని చేపల చెరువులకు సరఫరా చేస్తున్నారు. కంచికచర్ల మండలం పరిటాల చెరువు వద్ద కొంత సరుకు దిగుమతి చేస్తున్నట్టు తెలిసింది. గన్నవరం, కైకలూరు, గుడివాడ, అవనిగడ్డ, నాగాయలంక, మచిలీపట్నం తదితర ప్రాంతాలలో చెరువులకు సరఫరా చేస్తున్నారు. మాంసపు వ్యర్థాలను చెరువులలో వేయడంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదు. తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతుండటంతో పంట చేలల్లో పనులకు వ్యవసాయ కూలీలు కూడా రావడం లేదు. జల, వాయు కాలుష్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది.

మాంసం వ్యర్థాల వల్ల తీవ్ర నష్టం

మాంసపు వ్యర్థాలను సేకరించే వ్యాపారులు వాటిని నిల్వ ఉంచేందుకు కొన్ని క్రిమి సంహారకాలను వినియోగిస్తారు. దీంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలూ కలసి ఉంటాయి. వీటిని కొనుగోలు చేసిన చేపల చెరువుల యజమానులు యంత్రాల సాయంతో సన్నని ముక్కలుగా నరికి చేపలకు మేతగా వేస్తారు. దీంతో చేపల ద్వారా రసాయనాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు మానవ శరీరంలోకి చేరి వ్యాధులకు కారకాలుగా మారుతున్నాయి. కేన్సర్ వంటి భయంకరమైన వ్యాధులు సోకుతున్నాయి. మాంసపు వ్యర్థాలు కలిసిన నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గుతుంది. దీని కారణంగా చెరువుల యజమానులు తరచూ నీటిని మార్చుతుంటారు. ఆ నీటిని పశువులు తాగితే ప్రమాదకరం. కొందరి స్వార్థం మత్స్య పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ పరిస్థితుల నుంచి మత్స్య పరిశ్రమను, ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ కల్యాణికి అభినందనలు

కంకిపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డ్ వైస్ చైర్‌పర్సన్‌గా నియమితులైన తెలుగుమహిళా మండలి కార్యదర్శి మల్లెంపల్లి కల్యాణిని స్థానిక టీడీపీ నాయకులు గురువారం ఘనంగా సత్కరించారు. అనంతరం ఏఎంసీ డైరెక్టర్ గోగినేని వెంకటరమణను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, చిట్టూరి నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్, చిట్టూరి శ్యాము తదితరులు పాల్గొన్నారు.



మల్లెంపల్లి కల్యాణిని అభినందిస్తున్న కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి తదితరులు

గోతులు లేని రోడ్లే లక్ష్యం

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రసాదంపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గన్నవరం నియోజకవర్గంలో గోతులు లేని రోడ్లే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గురువారం రామవరప్పాడులోని సిండికేట్ బ్యాంకు కాలనీలో రూ.60 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను, డ్రెయినేజీలను ఆయన ప్రారంభించారు. కాలనీలో ఎమ్మెల్యే పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు లేవని స్థానికులు తెలపగా, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామాల్లో రహదారులను పునఃనిర్మిస్తున్నామని, డ్రెయినేజీల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వరి శ్రీదేవి, పంచాయతీ ఈవో గంటా రామ్మోహన్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు వడ్రాణం హరిబాబు నాయకులు కొల్లా ఆనంద్, నభిగాని కొండ, పట్టపు చంటి, నాగరాజు, బొమ్మసాని అరుణ, రవి పాల్గొన్నారు.



సిండికేట్ బ్యాంకు కాలనీలో రోడ్డు శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

టీడీపీ నున్న గ్రామ నేతకు మాతృవియోగం

విజయవాడ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నున్న టీడీపీ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి తల్లి పున్నమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నున్నలోని శ్రీనివాసరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

గన్నవరంలో అభివృద్ధి పనులకు ప్రారంభం నేడు

గన్నవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గన్నవరంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శుక్రవారం ప్రారంభించనున్నారు. ఎన్ఆర్ఈజీఎస్, గ్రామ పంచాయితీ నిధులతో రూ.1.90 కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, కాంపౌండ్ వాల్‌ను ప్రారంభించనున్నారు. రూ.70లక్షల నిధులతో వెలివెల సీతారామయ్య ఇంటి నుంచి కాసననేని శ్రీనివాసరావు ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మించారు. రూ.14లక్షల నిధులతో ఆవుల కోటయ్య ఇంటి నుంచి బరాక్ చర్చి వరకు నర్రా రెసిడెన్సి, ఆగిరిపల్లి రోడ్డు, మిల్క్ డైయిరి ఇంటర్నల్ రోడ్లు నిర్మించారు. రూ.18లక్షల నిధులతో వీనస్ నుంచి ఇండియన్ బ్యాంక్, కిడ్స్ ప్లే స్కూల్ వరకు సీసీ రోడ్డు నిర్మించారు. రూ.16లక్షల నిధులతో మండల పరిషత్ కార్యాలయ కాంపౌండ్ వాల్ నిర్మించారు. రూ.38లక్షల నిధులతో భోగేశ్వరరావు ఇంటి నుంచి ఏకాంబేశ్వరరావు ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మించారు. రూ.34లక్షలతో తిరుశెట్టి బాలస్వామి ఇంటి నుంచి పాత సీసీ రోడ్డు మీదుగా గ్లోబల్ కాలేజ్, ఇంటర్నల్ రోడ్ వరకు సీసీరోడ్లను నిర్మించారు. సుమారు 1.90 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించనున్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ తదితరులు

రోడ్డు అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

కంకిపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ సంబంధి త కాంట్రాక్టర్లకు సూచించారు. కంకిపాడులో సుమారు రూ.కోటి రూపాయలతో చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. కంకిపాడులో ప్రధానంగా ఉన్న 11 ప్రధాన రహదారులు అభివృద్ధి చేవామన్నారు. రానున్న నెల రోజుల్లో ఉపాధి హామీ నిధులు రూ. రెండు కోట్లతో మరో 24 రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కాంట్రాక్టర్లను బోడె ప్రసాద్ ఆదేశించారని తెలియజేశారు. టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సతీష్, పీఆర్ అసిస్టెంట్ ఇంజనీర్లు వరుణ్, రాజశేఖర్, సురేఖ పాల్గొన్నారు.



రైతు బజార్‌లో వర్మీ కంపోస్టు ఎరువులను విక్రయిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

భూసారం పెంచేందుకు

వర్మీ కంపోస్టు ఎరువు దోహదం

గన్నవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వర్మీ కంపోస్టుల ఎరువుల వాడకం వల్ల భూసారం పెరుగుతుందని, విక్రయాలతో పంచాయితీలకు ఆదాయం చేకూరుతుందని ఎంపీడీవో టి.స్వర్ణలత అన్నారు. స్థానిక రైతు బజార్‌లో పలు పంచాయతీలలో తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువుల విక్రయాలను గురువారం చేపట్టారు. వర్మీ కంపోస్టు ఎరువు నేలను గుల్ల పరుస్తూ భూసారాన్ని పెంచుతుందన్నారు. వర్మీ కంపోస్టులో పండ్లు, కూరగాయల ఉత్పత్తికి సహాయపడే పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. ఎరువు వాడటంతో రుచి, నాణ్యతను మెరుగు పరుస్తాయన్నారు. తటస్థ పీహెచ్ కారణంగా వర్మీ కంపోస్టు ఆమ్లతను పెంచుతుందన్నారు. మొక్కలకు అవసరమైన పోషకాల నత్రజనిని, పొటాషియం, కాల్షియం, మూలకాలు కలిగి మొక్కల పెరుగుదలపై అద్భుతమైన ప్రభావాన్ని చూపిస్తాయన్నారు. తొలిరోజు 525 కేజీల కంపోస్టు ఎరువుల విక్రయాలు జరిగినట్టు కార్యదర్శులు తెలిపారు. ఈవోపీఆర్డీ భారతి, పంచాయతీ కార్యదర్శులు చెన్నకేశవులు, సరోజిని, సీహెచ్ ప్రసాద్, లక్ష్మణరావు, భార్గవ్, ప్రసాద్, నాగలక్ష్మీ, మారుతీ ప్రసాద్, పంగిడయ్య, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.



గన్నవరం ఆర్టీసీ గ్యారేజ్‌లో మాట్లాడుతున్న ఎన్ఎంయూపీ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి



ఉయ్యూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్ గేటు ఎదుట నిరసన తెలుపుతున్న పీటీడీ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలి

పీటీడీ ఉద్యోగుల నిరసన

గన్నవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయుఏ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఉద్యోగుల ఉద్యోగ భద్రత 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని నాగిరెడ్డి కోరారు. అక్రమ సస్పెన్షన్‌లు, రిమూవల్స్ ఆపాలన్నారు. నాలుగేళ్లుగా నిలిచిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. 114 జీవోలో ఉన్న నైట్ అవుట్ అలవెన్స్‌లు రూ.150 నుంచి రూ.400 వరకు చెల్లించాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలని కోరారు. పారదర్శకమైన బదిలీల పాలసీని అమలేసి రిటైర్డ్ ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సులలో ప్రయాణాలను అనుమతించాలన్నారు. డిపో అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఆంజనేయులు, రాజు, నాని, బాబ్జీ పాల్గొన్నారు.

ఉయ్యూరు డిపో గ్యారేజీ గేటు ఎదుట

ఉయ్యూరు: ఏపీపీటీడీ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ఉయ్యూరు ఆర్టీసీ డిపో గ్యారేజి గేటు ఎదుట గురువారం ఉద్యోగులు నిరసతెలిపారు. అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలపై ఉన్నతాధికారులకు మెమోరాండం సమర్పించినప్పటికి యాజమాన్యం స్పందించకపోవడంతో 10, 11 తేదీల్లో రెండురోజులపాటు ధర్నాలు, గేట్‌మీటింగ్ నిర్వహించాలన్న నేషనల్ మాజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేర ధర్నాచేస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏఎస్‌రావు, డిపో కార్యదర్శి పీఎం కృష్ణ , వైస్ చైర్మన్ పిచ్చయ్య తెలిపారు. కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో

త్రయోదశి పూజలు

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : యనమలకుదురులోని రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం త్రయోదశి సందర్భంగా ప్రదోష కాలంలో మహానందీశ్వర స్వామికి అభిషేక, అర్చన కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని దేవస్థాన ప్రధాన అర్చకులు సాగర్, ఇతర అర్చకులతో కలిసి నిర్వహించారు. ఆలయ అభివృద్ధి దాత, రామలింగేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సంగా నరసింహారావు వ్యవహరించారు.



చెన్నకేశవస్వామి ఆలయానికి

మకర తోరణం బహూకరణ

కంకిపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నెప్పల్లిలోని భ్రమరాంబ చెన్న కేశవ స్వామి ఆలయానికి రూ. 3 లక్షల విలువైన మకర తోరణాన్ని గ్రామస్థులు చలసాని వెంకటేశ్వరరావు, కృష్ణ పావనిలు గురువారం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు భసవేశ్వరరావుకు మకర తోరణాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేతుల మీదుగా ఆలయానికి అందజేశారు. సీహెచ్ బోసు, గురునాథం, గోవిందు, అరుణ ప్రసాద్, శశిధర్, అర్చకులు భసవేశ్వరరావు పాల్గొన్నారు.



మకర తోరణాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేతుల మీదుగా అందజేస్తున్న దాతలు

ఉద్యోగ సాధనకు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ప్రసాదంపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఉన్నత ఉద్యోగ సాధనకు పరిపూర్ణ విద్యతో పాటుగా అంతర్గత నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఏపీఎస్సీహెచ్‌సీ చైర్మన్ డాక్టర్ కె.మధుమూర్తి అన్నారు. గురువారం ఎనికెపాడులోని ఎస్ఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాల 10వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అవకాశాలతోపాటు చాలెంజ్‌లు ఉన్నాయని, వీటిని సమర్థవంగా ఎదుర్కొవాలని సూచించారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ఏపీఎస్సీహెచ్‌సీ ఇంటర్న్‌షిప్స్ అందించాలని సంకల్పించామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించే దిశగా అన్ని విధాలుగా శిక్షణనిస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల చైర్మన్ అప్పారావు, సెక్రటరీ శ్రీకృష్ణ, ఏవో ప్రతాప్, టీపీవో శివనాగేశ్వరరావు, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎస్సీహెచ్‌సీ చైర్మన్ డాక్టర్ కె.మధుమూర్తి



నూజివీడు రైల్వే స్టేషన్‌లో నోట్ బుక్స్‌ను ఎగుమతి చేస్తున్న కార్మికులు

నూజివీడు నుంచి అస్సాంకు

నోటు బుక్స్, టైర్లు రవాణా

హనుమాన్‌జంక్షన్,ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నూజివీడు రైల్వే స్టేషన్ నుంచి గురువారం గౌహతి(అస్సాం)కి పార్శిల్ కార్గో ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ద్వారా నోట్ బుక్స్ టైర్లు ఎగుమతి అయ్యాయి. 8 వ్యాగిన్లలో 110 టన్నులు విలువ చేసే బుక్స్ కట్టలు, టైర్లు రవాణా చేశారు. విజయవాడకు చెందిన వ్యాపారులు చెన్నై నుంచి గౌహతికి వెళ్లే రైలులో కొన్ని వ్యాగిన్లను బుక్ చేసుకున్నారు. సరుకును మార్గమధ్యంలో నూజివీడు స్టేషన్‌లో లోడు చేసుకొని ఎగుమతి చేసుకునే అవకాశం ఇచ్చినట్టు రైల్వే అధికారులు తెలిపారు.



కాశీవిశ్వేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా పేరంటాలమ్మ తిరునాళ్లు

విజయవాడ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నున్నలో పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవా లు గురువారం ఘనంగా జరిగాయి. ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామికి ఆలయ అర్చకులు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను నిర్వహించారు. అనంతరం పద్మావతి శ్రీనివాస భక్త సమాజం ఆధ్వర్యంలో చాలీసా పారాయణం చేశారు. రాత్రి అంకమ్మతల్లికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విధులకు ఆటకం కలిగించిన వ్యక్తులకు జైలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : మల్లవల్లిలో ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన ఆరుగురికి నూజివీడు స్పెషల్ కోర్టు 15 రోజుల సాధారణ జైలు, జరిమానా విధించినట్టు ఎస్సై శ్రీనివాస్ గురువారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆక్రమణలు తొలగిస్తుండగా ఆరుగురు వ్యక్తులు విధులకు ఆటంకం కలిగించారు. విధులకు ఆటంకం కలిగించిన కన్నెగంటి ప్రభాకర్‌రావు, కన్నెగంటి భూషరావు, కన్నెగంటి కోటేశ్వరరావు, కన్నెగంటి రమ్య, కన్నెగంటి శివకుమారి, కన్నెగంటి విజయలక్ష్మిలపై వీఆర్వో సైకం వరప్రసాద్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సుబ్రహ్మణ్యం సీఆర్ నెం. 264-2021 అండర్ సెక్షన్ 353 ఐపీసీ ప్రకారం వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారని వివరించారు. సత్యన్నారాయణ కేసు విచారణలో నూజివీడు ఏపీపీ వి. ప్రసన్న వాదనల తరువాత నేరం రుజువైనందున నూజివీడు స్పెషల్ కోర్టు న్యాయాధికారి ఆరుగురి ముద్దాయిలకు ఒక్కొక్కరికీ 15 రోజుల సాధారణ జైలు, రూ.3వేల జరిమానా విధించినట్టు వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

రెవెన్యూ సేవలపై నిర్ణయించిన

రుసుమే వసూలు చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సేవలకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుము మాత్రమే ప్రజల నుంచి వసూలు చేయాలని బాపులపాడు తహసీల్దార్ బండ్రెడ్డి మురళీకృష్ణ గురువారం ఆదేశాలు జారీ చేశారు. మండల వ్యాప్తంగా గల మీసేవ, గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉన్న రెవెన్యూ సేవలకు సంబందించిన రుసుము పట్టిక ప్రజలు గమనించే విధంగా బోర్డు పెట్టాలని ఆదేశించారు. అధిక రుసుము వసూలు చేసినట్లు సమాచారం వస్తే వారిపై శాఖాపరంగా కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మీ సేవా రుసుం అధికంగా వసూలు చేస్తే చర్యలు

హనుమాన్‌జంక్షన్: మండలంలోని అన్ని సచివాలయాలు, మీ సేవ కేంద్రాల్లో రెవెన్యూ సేవలకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన రుసుము మాత్రమే వసూలు చేయాలని బాపులపాడు తహసీల్దార్ బి. మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైన అధిక రుసుం వసూలు చేసినట్లైతే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వీఎన్‌పురం కాలనీ సచివాలయం

కార్యదర్శి భార్గవ్‌కు పదోన్నతి

గన్నవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసరపల్లి శివారు వీఎన్‌పురం కాలనీ సచివాలయంలో గ్రేడ్-5 కార్యదర్శిగా పని చేస్తున్న భార్గవ్‌కు పదోన్నతి లభించింది. ఈ మేరకు గురువారం కలెక్టర్ డీకే బాలాజీ, డీపీవో అరుణ చేతుల మీదుగా గ్రేడ్-4 కార్యదర్శిగా పదోన్నతి పత్రాలను అందుకున్నారు. పెదపారుపూడి మండలం వింజరంపాడు కార్యదర్శిగా వెళ్లారు. కేసరపల్లి పంచాయతీ సిబ్బంది దుశ్శాలువ, పూలబొకే అందజేసి సత్కరించారు.



బీసీ సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర చేస్తున్న ముస్లింలు

వక్ఫ్ బిల్లును ఉపసంహరించాలి

ఆటోనగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా ఆమోదించిన వక్ఫ్ చట్ట సవరణను బీసీ, ఎస్సీ సంఘాలూ వ్యతిరేకిస్తున్నాయని బీసీ సంఘం మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ మహమ్మద్ తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో గురువారం పెనమలూరు నియోజకవర్గ పరిధిలోని అశోక్‌నగర్ నుంచి ఉయ్యూరు వరకు పాదయాత్ర చేపట్టారు. తొలుత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హమ్ దేశ్ బచానే అయే హై ఆప్ హమారే సాత్ చలో..అంటూ నినదించారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శౌంఠి నాగరాజు, సీపీఎం, సీపీఐ నాయకులు, మద్దతు దారులు పాల్గొనారు.

పాదయాత్రకు కంకిపాడులో ఘనస్వాగతం

కంకిపాడు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు అహ్మద్ బేగ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా చేపట్టిన పాద యాత్రకు కంకిపాడులో ఆయన ఘన స్వాగతం పలికారు. ముస్లిం పెద్దలు, మైనార్టీ నాయకులు అజ్గర్ షరీఫ్ పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు రద్దు చేసే వరకు ఉద్యమిద్దాం

ఉయ్యూరు: వక్ఫ్ సవరణ చట్టం రద్దుచేసేవరకు ఐక్యంగా ఉద్యమం చేద్దామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శౌంటి నాగరాజు అన్నారు. వక్ఫ్ సవరణ చట్ట రద్దు చేయాల ని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర గురువారం సాయంత్రం ఉయ్యూరు చేరుకుంది. మసీదు సెంటర్‌లో ఏర్పా టుచేసిన బహిరంగ సభలో వివిధ సంఘాలకు చెందిన నాయకులు వక్ఫ్ సవరణ చట్టంకు వ్యతిరేకంగా మాట్లాడారు. బీసీ సంఘం అన్ని సంఘాలతో కలసి చేపట్టిన ఉద్యమానికి అందరు మద్దతు పలకాలని ఆయన పిలుపునిచ్చారు. వైసీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు కలాం, బీ సంఘం మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఇబ్రహీం, సీపీఎం నాయకుడు కె శివనాగేంద్రం పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వపాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు జెడ్పీహైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ పులి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక పాఠశాలలోని ప్లస్‌టు ఇంటర్ విద్యార్థులకు హెచ్ఎం చోరగుడి అనిత తో కలిసి ఆయన నోటు పుస్తకాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యాప్తికి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకుని చదువులో బాగా రాణించాలని ఆకాంక్షించారు. సీఆర్పీ ఎస్ కవితాశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయిల్‌హబ్ కొండపల్లి..!

ఇక ఆయిల్, గ్యాస్‌కు ప్రధాన కేంద్రంగా మారనున్న చారిత్రక ప్రాంతం



ఆయిల్ ట్యాంకర్లు, గ్యాస్ లారీలు

- సీఆర్‌డీఏ పరిధిలో ఉండటం ప్లస్‌పాయింట్
- ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి సంస్థలన్నీ ఇక్కడే
- ఉపాధి అవకాశాలు మెరుగు, అభివృద్ధికి అవకాశం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల కుటుంబాలకు జీవనోపాధి
- ఇక్కడి నుంచే రాష్ట్రం మొత్తానికి గ్యాస్, ఆయిల్ సరఫరా

కొండపల్లి ప్రాంతం చారిత్రకంగా ఎంతో ప్రసిద్ధి. ప్రస్తుతం వేగంగా జరిగిన పరిణామాలతో ఈ ప్రాంతం సరికొత్త సొబగులు అద్దుకుంటోంది. కొండపల్లి ప్రాంతం రాజధాని ప్రాంతమైన సీఆర్‌డీఏ పరిధిలో ఉండటంతో రాజధాని అమరావతికి ఆయిల్ అండ్ గ్యాస్ హబ్‌గా మారనుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి సంస్థలన్నీ ఇక్కడే కొలువుదీరనున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెంది ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుంది. రాష్ట్రం మొత్తానికి ఆయిల్ ఇక్కడి నుంచే సరఫరా కానుంది.

-ఆంధ్రజ్యోతి, విజయవాడ:

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి ఆయిల్, గ్యాస్ సంస్థలన్నీ కొండపల్లిలో కొలువు తీరాయి. నానాటికీ వీటి పరిధి విస్తరిస్తుండటంతో పాటు ఉత్పాదకత, పంపిణీ సామర్థ్యాలు పెరుగుతున్నాయి. రాజధాని అమరావతి ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) పరిధిలో గ్యాస్, ఆయిల్ సంస్థలు కేంద్రీకృతమవడంతో కొండపల్లి 'ఆయిల్ అండ్ గ్యాస్ హబ్‌గా' చరిత్ర లిఖించబోతోంది. ఈ ప్రాంత అభివృద్ధికి కావలసిన గ్యాస్, ఆయిల్ సమృద్ధిగా సమీపంలో ఉండటంతో రవాణా ఖర్చులు, సమయం ఆదా అవుతాయని వ్యాపారవేత్తలు భావిస్తున్నారు. అమరావతి ప్రాంత అభివృద్ధి, పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహజవనరులు సమృద్ధిగా ఉండటంతో పనుల వేగం పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. విజయవాడ నగరానికి మణిహారంగా చెప్పుకునే పశ్చిమ బైపాస్ అందుబాటులోకి వస్తే, మైలవరం నియోజకవర్గంలోని కంపెనీలకు అరగంట వ్యవధిలో చేరుకునే అవకాశం ఉంటుంది. వేలాది మందికి జీవనాధారంగా మారిన గ్యాస్, చమురు సంస్థలు ఆ ప్రాంత స్థితిగతులను పూర్తిగా మార్చేశాయి.


విద్యానగరం వద్ద ఉన్న భారత్ గ్యాస్ సంస్థ


కట్టుబడిపాలెం వద్ద ఉన్న వీపీపీఎల్ - హెచ్‌పీసీఎల్ చమురు సంస్థ

ఇప్పటి పరిస్థితికి వ్యత్యాసం

ఒకప్పుడు వ్యవసాయం, కూలిపనులపై ఆధారపడి జీవించిన కట్టుబడిపాలెం, జి.కొండూరు, కొండపల్లి గ్రామాల్లో ఇప్పుడు ఉద్యోగాలు, వ్యాపారాలు పుష్కలంగా ఉన్నాయి. భోజన హోటళ్లు, టీ, టిఫిన్ సెంటర్లు, చిన్న వ్యాపారాలు బాగానే నడుస్తున్నాయి.

పైపులైన్‌ల ద్వారా సరఫరా

వైజాగ్ నుంచి 348 కి.మీ. మేర పైపులైన్ ద్వారా కట్టుబడిపాలెంలోని వీపీపీఎల్ - హెచ్‌పీసీఎల్ చమురు సంస్థకు ఆయిల్ వస్తోంది. అదే విధంగా గ్యాస్ కూడా గెయిల్ ఇండియా లిమిటెడ్‌కు 343 కి.మీ. పైపులైన్ ద్వారా వస్తోంది. ఇక్కడి నుంచే తెలంగాణకు కూడా సరఫరా జరుగుతోంది.

పటిష్ట భద్రత, అవగాహన

ఈ పైపులైన్‌లకు సంబంధించి ఆయా సంస్థలు పటిష్ట భద్రత ఏర్పాటు చేశాయి. గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాజాతలు, మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. ఎక్స్ మిలిటరీ గార్డులతో భద్రతను మెరుగుపరుస్తున్నారు.

అన్ని సంస్థలూ ఒకేచోట

మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు మండలాల్లో హెచ్‌పీసీఎల్, భారత్ గ్యాస్, భారత్ చమురు సంస్థ, ఇండియన్ ఆయిల్, గెయిల్ ఇండియా లిమిటెడ్ వంటి సంస్థలున్నాయి. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి ఐడీఏలో హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్, బీపీసీఎల్ సంస్థల గ్యాస్ బండ్లకు నింపే ఫిల్లింగ్ స్టేషన్లున్నాయి. ఈ ప్రాంతం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్యాస్ గోదాంలకు గ్యాస్, పెట్రోల్, డీజిల్‌ను సరఫరా చేస్తున్నారు. కంపెనీల ద్వారా ప్రత్యక్షంగా ఉద్యోగాలు చేసేవారితో పాటు, పరోక్షంగా ఉపాధి పొందుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. డ్రైవర్లు, సిలిండర్ రిపేర్, తయారీ యూనిట్ల ద్వారా అనేక మందికి ఉపాధి లభిస్తోంది.



జి.కొండూరులోని గెయిల్ ఇండియా లిమిటెడ్ సంస్థ

సమస్యలు తలెత్తకుండా రీ సర్వే చేయాలి: కలెక్టర్

పెదపారుపూడి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రీ సర్వే ప్రక్రియను సజావుగా చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం ఆయన పెదపారుపూడి మండలం పాములపాడు గ్రామంలోని గ్రామ రెవెన్యూ అధికారి కార్యాలయ భవనంలో రీ సర్వేకు సంబంధించిన రికార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పరిధిలో ఇప్పటి వరకు పూర్తి చేసిన రీ సర్వే ప్రక్రియ, తలెత్తిన సమస్యలపై ఆరా తీశారు. ఈ ప్రాంతంలో ఆక్వాసాగు అధికమని, వ్యక్తిగతంగా కాకుండా ఒకే చేపల చెరువు కింద ఎక్కువ మంది రైతులకు చెందిన భూములుండే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటి సరిహద్దులు, అదేవిధంగా సబ్ డివిజన్ చేసే క్రమంలో జాగ్రత్త వహించాలన్నారు. ఉమ్మడి భూముల విషయంలో సరిహద్దులు తేలిన వాటికి సబ్ డివిజన్ చేసి ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సెల్ మ్యాప్) సంఖ్య కేటాయింపు జరగాలని సూచించారు. ఉమ్మడి భూములకు జాయింట్ ఎల్‌పీఎం కేటాయించటం ద్వారా భవిష్యత్‌లో ఆయా రైతులకు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ఈ సమస్యను పరిష్కరించటానికి రైతులు సహకరించాలని కోరారు. రీ సర్వేకు ముందు ఆయా భూముల రైతులకు తప్పనిసరిగా తెలియపరచాలన్నారు. పెదపారుపూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో పొలం గట్లపై పండించిన పంటలను ఆయన పరిశీలించారు. కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, తహసీల్దార్ వై.రగంఆరావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుందరరావు, గ్రామసర్పంచ్ వి.స్వాతి, చప్పిడి సమీరా, నీటి సంఘం అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, మండల గ్రామ సర్వేయర్లు కలెక్టర్ వెంట ఉన్నారు.


రీసర్వే ప్రక్రియ తెలుసుకుంటున్న కలెక్టర్

ప్రధాని మోదీ సహకారం ఎనలేనిది

- ఎక్స్‌లో ఎమ్మెల్యే సుజనా చౌదరి

వన్‌టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రధాని మోదీ అందిస్తున్న సహకారం ఎనలేనిదని ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. ఈ మేరకు గురువారం ఎక్స్‌లో ఒక సందేశాన్ని పంపించారు. తిరుపతి- కాట్పాడి రైల్వేలైన్ నిర్మాణానికి తాజాగా కేంద్రం రూ.1332 కోట్లు మంజూరు చేయడమే ఏపీకి ప్రధాని మోదీ సహకరిస్తున్నారన్నదానికి నిదర్శనమన్నారు. రాజధాని అమరావతితో సహా ఏపీలోని అన్ని ప్రాంతాలను మోదీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల తరఫున మోదీకి ధన్యవాదాలు చెబుతున్నట్టు తెలిపారు.

హజ్ యాత్రికులకు టీకాలు వేయండి

వన్‌టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రికులకు టీకాలు వేయాలని కోరుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, ఇమ్యూనైజేషన్ అధికారులకు విజయవాడ హజ్ కమిటీ కార్య నిర్వహణ అధికారి (ఈవో) గురువారం వినతి పత్రాలు అందజేశారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశాల మేరకు ఈ వినతి పత్రాన్ని అందచేసినట్టు తెలిపారు. హజ్ యాత్రికులకు ఇబ్బంది లేకుండా టీకాలు వేయడానికి జిల్లాల పరిపాలనాధికారులకు తగిన ఆదేశాలిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని ఈవో తెలిపారు. టీకాల తరువాత తగిన సమయం అవసరం ఉండడంతో యాత్రకు బయలుదేరడానికి కనీసం 15 రోజులు ముందు టీకా వేయించుకోవాలని ఈవో తెలిపారు. హజ్ సొసైటీలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

అపరిష్కృత సమస్యల పరిష్కారానికి 17న ధర్నా

- పీఎంటీఎఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

గాంధీనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న ధర్నా చేపడుతున్నట్టు ప్రోగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పీఎంటీఎఫ్ ఏపీ) రాష్ట్ర అధ్యక్షుడు సోమరౌతు శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళగిరి బైపాస్‌లోని విద్యాభవన్ వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ధర్నా జరుగుతుందన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ ధర్నా చేయాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. మున్సిపల్ ఎడ్యుకేషన్ యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ విడుదల చేసి బదిలీల చట్టం రూపొందించాలన్నారు. అప్‌గ్రేడ్ చేసిన మున్సిపల్ పాఠశాలలకు పోస్టులు మంజూరు లేదా కేటాయింపులు చేయాలని, మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని, మున్సిపల్ ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రధానకార్యదర్శి పి.సుమంత్ పాల్గొన్నారు.

జీవో 35 నష్టాలను సవరించండి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖలో ప్రభుత్వం చేపట్టిన పాలనా సంస్కరణల్లో జీవో 35 వల్ల పదోన్నతుల్లో తీరని అన్యాయం జరుగుతోందని ఉమ్మడి కృష్ణాజిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ జేఎల్ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవోల పదోన్నతి కోటాలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గతంలో ఫీడర్ కేటగిరిని బట్టి ఎంపీడీవోల పదోన్నతిలో 34శాతం కేటాయింపు జరిగేదన్నారు. ఈవోఆర్‌డీలకు 33శాతం, నేరుగా ఎంపీడీవోల నియామకాలకు 30శాతం, ఇతరులకు 3శాతం కేటాయింపులు జరిగేవన్నారు. సంస్కరణల్లో భాగంగా ఎంపీడీవోల నేరుగా నియామక కోటాను రద్దు చేసినందున కేడర్ స్ట్రెంత్ ప్రకారం ఎంపీడీవోల పదోన్నతిలో 50 శాతం కేటాయించాలన్నారు. అయితే 30 శాతం మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. దీనిపై ఉన్నతాధికారులు, పాలకులు పునరాలోచించాలన్నారు.

సమ్మర్ స్పెషల్ రైళ్లు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని క్లియర్ చేయడానికి దక్షిణ మధ్య రైల్వే వివిధ ప్రాంతాలకు సమ్మర్ స్పెషల్ ప్రత్యేక రైళ్ల 24 సర్వీసులు నడుస్తాయని విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రుపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 నుంచి జూన్ 27 వరకు 07025 చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు ప్రతి శుక్రవారం 12 సర్వీసులు నడవనుంది. 12 నుంచి జూన్ 28 వరకు 07026 శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి ప్రతి శనివారం 12 సర్వీసులు నడవనుంది. ఈనెల 13 నుంచి జూన్ 29 వరకు 07637 తిరుపతి - షిర్డీసాయినగర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం నడుస్తుంది. మొత్తం 12 సర్వీసులుంటాయి. ఈనెల 14 నుంచి జూన్ 30 వరకు 07638 షిర్డీ సాయి నగర్- తిరుపతి ప్రతి సోమవారం నడుస్తుంది. మొత్తం 12 సర్వీసులుంటాయన్నారు.


పునఃప్రతిష్ఠ అనంతరం అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అంగరంగ వైభవంగా..

ఘనంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారి పునఃప్రతిష్ఠ

తాత్వికుడు గెంటేల చేతుల మీదుగా యంత్రప్రతిష్ఠ

భారీగా హాజరైన భక్తులు, అన్న సమారాధన

జగ్గయ్యపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం పునఃప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. తాత్వికుడు, బలుసుపాడు శ్రీ గురుధామ్ వ్యవస్థాపకుడు గెంటేల వెంకటరమణ, వసంతలక్ష్మి దంపతుల హస్తాలతో ఉదయం 8-59 గంటలకరు శ్రీమహాలక్ష్మి అమ్మవారి యంత్రస్థాపనను నిర్వహించారు. తొలుత గణపతి పూజ, కర్మణఃపుణ్యాహావచనం, గోపూజ నిర్వహించారు. మూలమంత్ర సహిత రక్షాహోమాలు, పూర్ణాహుతిని యాజ్ఞికుడు జే కిశోర్‌శర్మ, ఇరువంటి వెంకటరమణశర్మ, సత్యనారాయణశర్మ నిర్వహించారు. యంత్ర ప్రతిష్ఠ అనంతరం బింబస్థాపనల అనంతరం కల్యాన్యాసం, బీజన్యాసం, ధాతున్యాసం అనంతరం అమ్మవారి తొలి దర్శనాన్ని గోమాతతో చేయించి, భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. మహాలక్ష్మి అమ్మవారితో పాటు గణపతి, సాయినాథుడు విగ్రహాలను పునఃప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా, జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు తుమ్మెపల్లి నరేంద్రరావు, వైకాపా నేతలు చౌడవరపు జగదీష్, వట్టెం మనోహర్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి కే నాగేశ్వరరావు, నిర్వహణ కమిటీ చైర్మన్ సూరె రాము ముఖ్యనేతలు, ప్రముఖులకు స్వాగతం పలికి దర్శనం కల్పించారు.

అందరి వృద్ధి కోరుకుంటే అమ్మ అనుగ్రహం: గెంటేల

అందరి వృద్ధి కోరుకున్న వారిని శ్రీమహాలక్ష్మి అమ్మవారు త్వరగా అనుగ్రహిస్తుందని తాత్వికుడు గెంటేల వెంకటరమణ అన్నారు. ప్రతిష్ఠ సందర్భంగా అనుగ్రహభాషణం చేసిన ఆయన పరహితం కోరే వారంటే అమ్మకు ఎంతో ఇష్టమన్నారు.

తల్లిదండ్రులను విస్మరించటమే అలక్ష్మి: తాత్వికులు చిట్టా

తల్లిదండ్రులను విస్మరించటమే అలక్ష్మి అని తెలుసుకోవాలని తాత్వికుడు, శ్రీ గాయత్రీ ఆశ్రమ వ్యవస్థాపకుడు చిట్టా లక్ష్మీ నరసింహశాస్త్రి అన్నారు. పునఃప్రతిష్ఠకు హాజరైన ఆయన భక్తులకు అనుగ్రహభాషణం చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

- కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

ఉంగుటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మనిషి ఆరోగ్యం, భూసార పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించడం ఎంతో అవసరమని, రైతులు జీరో బేస్డ్ న్యాచురల్ ఫార్మింగ్ (జడ్బీఎన్ఎఫ్) విధానంపై దృష్టి సారించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. మండలపరిధిలోని ఇందుపల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం మధ్యాహ్నం ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయపద్ధతిలో పంటలు పండించే రైతులు తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకర, నాణ్యమైన దిగుబడులు సాధిస్తూ అధిక లాభాలు పొందవచ్చునన్నారు. రసాయనిక పద్ధతిలో చేపట్టే వ్యవసాయానికి అధిక పెట్టుబడులతోపాటు భూసారాన్ని కోల్పోవడం, ఆహారం, నీటి కాలుష్యంతో ప్రజలు రోగాల బారిన పడటం వంటి దుష్ప్రభావాలు ఉంటాయన్నారు.

పొలంగట్లపై సాగుతో అదనపు ఆదాయం

ప్రకృతి వ్యవసాయంపై అనుభవం కోసం రైతులు మొదట తక్కువ విస్తీర్ణంలో సాగుచేపట్టాలని సూచిస్తూ, పొలం గట్లను పెద్దవిగా చేసుకుని వాటిపై కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించడం ద్వారా వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడి కూరగాయలు, ఆకుకూరల అమ్మకంతో వచ్చే రాబడి భర్తీ చేస్తుందన్నారు. నేలను సారవంతం చేసుకునేందుకు పొలంలో పచ్చిరొట్టగా నవధాన్యాలను చల్లుకోవాలన్నారు. ధరల పెరుగుదలతో భవిష్యత్తులో రసాయనిక వ్యవసాయం భారం కానుందని, ప్రకృతి వ్యవసాయం నిశ్శబ్ద విప్లవంతో రానున్నరోజుల్లో ప్రజల్లో కచ్చితంగా మార్పును తీసుకొస్తుందన్నారు. తొలుత గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పదేళ్లనుంచి వివిధరకాల పంటలు పండిస్తున్న అభ్యుదయ రైతు కోగంటి శ్రీరామ్‌ప్రసాద్ ఇంటిని సందర్శించిన కలెక్టర్ అక్కడ ప్రకృతి వ్యవసాయం తీరును పరిశీలించారు. ఘనజీవామృతం, ద్రవజీవామృతం తయారీ విధానం, చిరుధాన్యాల విత్తనాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి గల రైతులకు చిరుధాన్యాల కిట్లను పంపిణీచేశారు. సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పార్థసారథి, ఏడీపీఎం నాగమల్లేశ్వరి, తహసీల్దార్ జె.విమలకుమారి, ఆర్ఐ బి.సూర్యకాంతి, స్వయంసహాయక సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


రైతు కోగంటి శ్రీరామ్‌ప్రసాద్ ఇంటివద్ద చిరుధాన్యాల సాగుపై ఆరా తీస్తున్న కలెక్టర్

నాగాయలంకలో నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హల్‌చల్

నాగాయలంక, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌నంటూ స్థానికంగా పలువురు వ్యాపారులను మోసం చేసిన ఏలూరు జిల్లా బాపులపాడు మండలం మడిచర్ల గ్రామానికి చెందిన గుగ్గులోతు శ్రీనివాస్ నాయక్‌ని నాగాయలంక పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుడు శ్రీనివాస్ నాయక్ 2000 నుంచి 2016 వరకు ఇండియన్ ఆర్మీలో జవాన్‌గా పని చేసి వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. అదే ఏడాది చిలకలూరిపేట దగ్గర యడ్లపాడులోని స్పిన్నింగ్ మిల్స్‌లో సెక్యూరిటీ ఆఫీసర్‌గా పని చేస్తూ మద్యానికి బానిసయ్యాడు. అనంతరం గుంటూరుకు చెందిన మహిళను పెళ్లి చేసుకున్నారు. సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగం మానివేసి, అక్కడ నుంచి భార్యతో గుంటూరు అంబేడ్కర్ నగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. రోడ్ పక్కన మొబైల్ యాక్సరీస్ అమ్ముకుంటూ జీవిస్తుండగా, దానిపై ఆదాయం కుటుంబానికి, చెడు వ్యసనాలకు సరిపోకపోవటంతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడినట్టు తెలిపారు. ఈనేపథ్యంలో మారుమూల గ్రామమైన నాగాయలంకను ఎంచుకొని ఆన్‌లైన్ మోసాలను ప్రారంభించినట్టు తెలిసింది. తాను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వద్ద అసిస్టెంట్‌గా పని చేస్తున్నానంటూ ఈ నెల 7న నలుగురికి ఫోన్ చేసి బెదిరించి, మోసం చేసి వారి నుంచి రూ.31,410 ఫోన్ ద్వారా వసూలు చేశాడు. బాధితులు అతడు నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అని తెలిసి 9న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కె.రాజేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా, డివిజన్ అధికారుల ఆదేశాలతో ముద్దాయి కోసం గాలింపు చర్యలు చేపట్టగా, గురువారం ఉదయం 11.30 గంటలకు నాగాయలంక వచ్చి మిగిలిన హోటళ్ల వాళ్లను బెదిరించి డబ్బులు వసూలు చేస్తుండగా, నాగాయలంకలోని శాంతి సినిమా హాల్ సెంటర్ బస్టాప్ వద్ద శ్రీనివాస్ నాయక్‌ను పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.25 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రికార్డులతో ముద్దాయిని అవనిగడ్డ కోర్టు నందు హాజరు పర్చినట్టు ఎస్ఐ తెలిపారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



నకిలీ ఫుడ్ ఇన్స్‌పెక్టర్‌ను అరెస్టు చూపుతున్న ఎస్ఐ రాజేష్

మహిళ మృతి కేసులో అనుమానితుడి చిత్రం విడుదల



పెనమలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): యనమలకుదురులోని లంక భూముల్లో గత శనివారం ఒక మహిళ మృతిచెందిన కేసును చాలెంజ్‌గా తీసుకున్న పెనమలూరు పోలీసులు ఈ కేసులో పక్కా ఆధారాలు లభించినట్టు భావిస్తున్నారు. మృతురాలు హత్యకు గురైందన్న దిశగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిగా భావిస్తున్న వీడియోను పోలీసులు సంచరించిన విడుదల చేశారు. గత శనివారం పెనమలూరు పోలీసులు యనమలకుదురు లంక భూముల్లో ఒక మహిళ మృతదేహన్ని స్వాధీనం చేసుకొని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. యనమలకుదురు కరకట్ట, రామలింగేశ్వరాలయం వద్ద స్వాధీనం చేసుకొన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా ఈనెల 4న ఉదయం 9గంటలకు చింతకట్ట సమీపంలోని ఒక ఇంటివద్ద గుర్తు తెలియని ఒక మహిళ, వ్యక్తితో కలిసి హతురాలు నదివైపు వెళుతున్నట్టు పోలీసులు గుర్తించారు. వెళ్లేటప్పుడు ముగ్గురూ వెళ్లగా గంటన్నర తర్వాత సుమారు పదిన్నరకు ఆమెతో వెళ్లిన మహిళ, వ్యక్తి మాత్రమే వచ్చినట్టు గుర్తించారు. వీరివెంట వెళ్లిన మహిళ మాత్రం తిరిగి రాలేదు. మృతురాలితో వెళ్లిన మహిళ ముందు జాగ్రత్తగా ముఖానికి మాస్క్ ధరించినట్టు పోలీసులు గుర్తించారు. మృతురాలితో వెళ్లిన మాస్కు ధరించిన మహిళ, వ్యక్తి ఎవరనే దానిపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వీరిద్దరూ మృతురాలిని నమ్మించి లంక భూముల్లోకి తీసుకువెళ్లినట్టు అనుమానిస్తున్నారు. ముక్కు, నోరు, కళ్ల వెంట ఉన్న రక్తపు చారికలను బట్టి ఆమెను వారిద్దరూ గొంతు నులిమి హత్య చేశారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మగ వ్యక్తి మాస్కు ధరించి ఆ పరిసరాల్లో ఒక్కడే సంచరిస్తున్న వీడియోను పోలీసులు విడుదల చేశారు. మృతదేహం కోసం ఎవరైనా బంధువులు వస్తారని పోలీసులు బాడీకి పోస్టుమార్టం నిర్వహించలేదు. ఫుటేజీలో పోలీసులు గమనించిన మహిళ, వ్యక్తి కోసం ఎస్ఐ ఫిరోజ్ నేతృత్వంలోని పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

తోట్లవల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(మెయిన్) ఉపాధ్యాయులు గురువారం ఎన్రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. తోట్లవల్లూరు సినిమాహాలు రోడ్డులో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం విజయశ్రీ, ఉపాధ్యాయులు ఐ. విజయలక్ష్మీ, జి. శివకుమారి , అంగన్వాడీ కార్యకర్త కోకిలరాణితో కలిసి ఇంటింటికి తిరిగారు. తల్లిదండ్రులతో మాట్లాడి 5మంది విద్యార్థులను ఒకటో తరగతిలో చేర్పించారు. మంచి వసతులున్న ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని ప్రధానోపాధ్యాయిని విజయశ్రీ కోరారు.


ఇంటింటికి తిరిగి విద్యార్థులను చేర్పించిన ఉపాధ్యాయులు

అధ్వాన రహదారిపై తప్పని ఫీట్లు

● రోడ్డుపై దుమ్మూ, ధూళితో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - పమిడిముక్కల) : మంటాడ-లంకపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు కపిలేశ్వరపురం వద్ద గోతులతో అధ్వానంగా తయారైంది. దీంతో ప్రయాణికులు రాకపోకల సమయాల్లో సర్కస్‌ఫీట్లు చేయాల్సి వస్తోంది. దీంతోపాటుగా వాహనాలు ప్రయాణించే సమయాల్లో రోడ్డుపై దుమ్మూ , ధూళి గాలికిలేచి రోడ్డుపై వెళ్లే వారిపై పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. గ్రామానికి ఇరువైపులా వైసీపీ హయంలో రోడ్డు నిర్మించి, గ్రామ నడిబొడ్డున కొంతమేర వదిలివేశారు. దీంతో ఆప్రాంతమంతా గోతులతో నిండిపోయింది. దీంతో స్థానికులు కంకర, డస్ట్ పోసి ఆగోతులు పూడ్చేశారు. అయినప్పటికి వాహనాల తాకిడికి ఆ రోడ్డు యథాస్థితికి చేరుకుంది.ఈ రహదారికి మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాల్లేవని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే రోడ్డు దుమ్మూ , ధూళి లేచి పరిసరాలో గృహాల్లోకి వెళ్లడమే కాక రోడ్డుపై వెళ్లే వారిపై పడుతుంది. దీంతో ఆ ప్రాంత ప్రజలు తరచూ అనారోగ్యానికి గురవక తప్పడం లేదు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ధ్వంసమైన రహదారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


కపిలేశ్వరపురంలో వాహనాల రాకపోకలతో గాలికి లేస్తున్న దుమ్మూ, ధూళి

దుమ్మూ, ధూళితో రోగాల పాలవుతున్నాం



రోడ్డుపై వాహనాలు వెళ్లేప్పుడు దుమ్మూ, ధూళి లేచి గాలికి ఇళ్లలోకి రావడంతో రోగాల పాలవుతున్నాము. గ్రామం మధ్యలో కొంతమేర రోడ్డు వేయకపోవడం వల్ల రాకపోకల సమయాల్లో ఇబ్బంది పడుతున్నాం.

పరుచూరి వెంకటసుబ్బయ్య, గ్రామస్థుడు

గోతుల్లో నిలిచిన నీటితో ఇబ్బందులు



గ్రామంలో కొంతమేర రోడ్డు వేయకపోవడంతో కొద్దిపాటి వర్షానికే గోతుల్లో నీరు నిలిచిపోతుంది. దీంతో ప్రయాణికులు ఏదిరోడ్డో, ఏది గొయ్యో తెలియక ప్రమాదాల బారీన పడక తప్పడం లేదు.

చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, గ్రామస్థుడు


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రభుత్వ పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని వినతి

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : తమ పిల్లలు చదువుతున్న పాఠశాలను యథాతథ స్థితి కొనసాగించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం గుడ్లవల్లేరులో జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీకి వినతిపత్రాన్ని అందజేశారు. పాఠశాలల రీస్ట్రక్చర్ పేరిట గుడ్లవల్లేరు ప్రాథమికపాఠశాల -1 లోని ఒకటి నుంచి 5 తరగతుల పిల్లల్ని గుడ్లవల్లేరు -2 పాఠశాలకు తరలించే ప్రక్రియను ప్రాసెస్‌లో పెట్టారు. అయితే తమ పిల్లలను పాఠశాల -1 లోనే ఉంచాలని వేరే పాఠశాలలో కలపడాన్ని వ్యతిరేకిస్తూ కలెక్టర్‌కు పలువురు తల్లితండ్రులు వారికి కల్గే ఇబ్బందిని వినతిపత్రంద్వారా తెలియజేశారు. కలెక్టర్ మోడల్ స్కూల్‌లో చదివితే మీ పిల్లల భవిషత్ బాగుంటుందని మెరుగైన విద్యను నేర్చుకొంటారని కలెక్టర్ వారికి వివరించారు. అయితే ఇక్కడా టీచర్లు బాగానే చెబుతున్నారని మాపిల్లల్ని అక్కడికి పంపలేమని తమకు న్యాయం జరిపించాలని కోరారు.


గ్యారేజ్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : ఎన్ఎంయూ

గుడివాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కార్మికులకు మేలు చేకూర్చే 1/219 సర్క్యులర్‌ను వెంటనే విడుదల చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ గుడివాడ డిపో కార్యదర్శి మదన్‌మోహన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయు ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయబద్ధమైన సమస్యలతో పాటు, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షులు జి.ఎస్ రావు, నాయకులు ఎల్.ఆర్ బాబు, రామారావు, సుబ్బారావు, మోషే, శ్రీను, రవి, రాజు, సోములు పాల్గొన్నారు.


చినముత్తేవి వద్ద వృథాగా పోతున్న తాగునీరు

తాగునీరు వృథా

కూచిపూడి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఐలూరు నుంచి పైపులైన్ల ద్వారా సరఫరా అయ్యే కృష్ణా వాటర్ (తాగునీరు) పైపుల లీకుల కారణంగా నీరు వృథాగా పోతుంది. మొవ్వ మండలంలోని పలు గ్రామాలకు పైపులైన్ ద్వారా కృష్ణా వాటర్ అందిస్తున్నారు. శివారు గ్రామాలైన అవిరిపూడి, మంత్రిపాలెం, నిడుమోలు, వీరాయిలంక తదితర గ్రామాలకు సరఫరా అయ్యే తాగునీరు అవిరిపూడి, చినముత్తేవి గ్రామాల మధ్యలో ఏర్పడిన పెద్ద లీకుల ద్వారా నీరు వృథాగా పోతుంది. గత కొన్ని నెలలుగా ఈ విధంగా జరుగుతున్నప్పటికీ అధికారులు చర్యలు చేపట్టిన దాఖలు కనిపించలేదు. ఐలూరు నుంచి వచ్చే తాగునీరు వారం రోజుల్లో కొన్ని రోజులు రాకపోవటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ కృష్ణా వాటర్‌ను సక్రమంగా అందించాల్సిందిగా మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సకాలంలో సాగు నీటిని అందించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : త్వరలో ప్రారంభమవుతున్న ఖరీఫ్ సాగుకు అవసరమైన సాగు నీటి సరఫరాలో రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సంబంధిత ఇరిగేషన్ అధికారులకు సూచించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం సాగు,తాగు నీటి సరఫరాలో అవంతరాలు పరిష్కరంలో భాగంగా ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గ పరిధిలోని పలు గ్రామాల్లోని పంట కాల్వల్లో సాగు నీటి పారుదలకు అవరోధంగా గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలతో పెరుకుపోయిన కాల్వల్లో తక్షణమే మరమ్మత్తులు నిర్వహించాలని ఆదేశించారు. కాల్వలశుభ్రతకు సంబందించి టెండర్లు ఖరారైన కాంట్రాక్టర్లతో పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించేలా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వనిధులు రూ.12కోట్లతో కొనసాగుతున్న పనుల నిర్వహణలో ఏవైనాలోపాలుంటే తనదృష్టికి తీసుకురావాలని కోరారు.వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈసమావేశంలో కృష్ణా డెల్టా ప్రాజెక్టుకమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, పామర్రు డీసీ వేంకటేశ్వరరావు, ఇరిగేషన్ డీఈఈలు భరత్, వీరాంజనేయులు, బాబునాయక్ బందరు కాల్వ, బల్లిపర్రులాకు ఏఈలు అరుణ్‌కుమార్, భగవతి, సిద్ధిఖ్, నాగబాబు, చిరంజీవి, పవన్, సత్యనారాయణలు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పేదరిక నిర్మూలనే పీ4 సర్వే లక్ష్యం

● కలెక్టర్ డీకే బాలాజీ

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో సామాజిక, ఆర్థిక, జీవన స్థితిగతుల ఆధారంగా అత్యంత పేదరికం అనుభవిస్తున్న వారి జాబితాను త్వరితగతిన సిద్ధం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. గురువారం సాయంత్రం గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో పీ4 సర్వే నిర్వహిస్తున్న టీమ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ పేదలను గుర్తించడంతో పాటుగా వారికి ఏవిధమైన ఉపాధినైపుణ్యాలు, మార్కెటింగ్, ఆర్థికపరమైన అంశాలు అవసరమో కూడా గుర్తించాలన్నారు. పేద ప్రజల జీవన విధానం మెరుగుపరిచేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గుడివాడ ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, ఏపి మాస్ సర్వే ప్రతినిధులు డాక్టర్ శ్రీనివాసరావు, కళామణి, ఎంపీడీవో టి.వి జయసారథి, తహసీల్దార్ లోకరాజు తదితరులు పాల్గొన్నారు.


పీ4 సర్వే అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ


డోకిపర్రులో ఉపాధి పనులను ప్రారంభిస్తున్న వీరమాచినేని శివప్రసాద్

ఉపాధి పనులు ప్రారంభం

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధిహామీ పథకం పనులు డోకిపర్రులో గురువారం పూజలు నిర్వహించి ప్రారంభించారు. గ్రామంలోని 6 పంటబోదులకు 2500 మందికి పనులు కల్పించారు. ఆపనులకు గ్రామ టీడీపీ అధ్యక్షులు వీరమాచినేని శివప్రసాద్ పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలతో జాని, ఉపాధి పనుల ఫీల్డ్‌అసిస్టెంట్ రంగారావు పాల్గొన్నారు.

'చిమటా' సేవలు చిరస్మరణీయం

పామర్రు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సమాజానికి వివిధ హోదాల్లో చిమటా సూర్యనారాయణ(85) అందించిన సేవలు సదా చిరస్మరణీయమైనవని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. స్థానిక పాలశీతాల కేంద్ర ఫంక్షన్‌హాల్లో గురువారం చిమటాసూర్యనారాయణ సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే చిమటా చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీరాంజనేయదేవస్థానం మాజీచైర్మన్, మండల సీనియర్‌సిటిజన్స్ అధ్యక్షులు,విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగిగా సమాజానికి చిమటా అందించిన సేవలను ప్రస్తుతించారు. ఆయన కుటుంబ సభ్యులను పరమర్శించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వీరమ్మతల్లి వార్షిక జాతర నేడు


విద్యుద్దీప కాంతులతో మామిడికోళ్ళ వీరమ్మతల్లి ఆలయం

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : శతాబ్ద కాలంగా భక్తుల కొంగుబంగారంగా పూజలందుకొంటున్న మామిడికోళ్ల వీరమ్మతల్లి అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం శుక్రవారం మామిడికోళ్లలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇటీవలే అమ్మవారి ఆలయ పునః నిర్మాణం, ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా నిర్వహించిన విషయం విదితమే. కాగా శుక్రవారం ఉదయం గద్దెపూజ, అమ్మవారిని ఊరచెరువులో పుణ్యస్నానం ఆచరింపచేసి పుట్టింటికి తీసుకు వెళ్లారు. మధ్యాహ్నం జమీపూజ చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేయనున్నారు. రాత్రి 10 గంటల నుంచి వీరమ్మ తల్లి ప్రభ బళ్ల గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు.

వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజన వసతి


వృద్ధులకు భోజన వసతి కల్పిస్తున్న రామకృష్ణ

గుడివాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వర్ధమాన్ మహావీర్ జయంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం చేసి మానవత్వాన్ని చాటిన జ్ఞాన్‌చంద్‌కు బీజేపీ టూటౌన్ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ(ఆర్‌.కె) ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్థానిక మందపాడులోని నిరాశ్రయుల కేంద్రంలో గురువారం పేదలకు భోజనవసతి కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహావీర్ జయంతి సందర్భంగా జ్ఞాన్‌చంద్ కుటుంబసభ్యుల సహకారంతో ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు భోజనాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షులు రూప్‌చంద్, హారిక తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం

● జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జి.రాణి


సదస్సులో మాట్లాడుతున్న జిల్లాప్రాజెక్టు అధికారిణి రాణి

పామర్రు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్య సమాజ స్థాపన సాధ్యమని జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు డైరక్టర్ జి.రాణి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పామర్రు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గర్భిణులకు, బాలింతలకు, అంగన్వాడీ కార్యకర్తలకు, ఆశవర్కర్లకు పోషణ్ పక్వాడ్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాణి మాట్లాడుతూ 2025 పోషణ్ అభియాన్ పథకం ద్వారా ఈనెల 22వరకు అంగన్వాడీ కేంద్రాల్లోని ప్రతి ఆరేళ్ల వయస్సుగల చిన్నారులకు, గర్భిణులకు , బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించే బాధ్యత అంగన్వాడీ కార్యకర్తలు,ఆశవర్కర్లు తీసుకోవాలన్నారు. సంబంధిత కేంద్రాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లు, సిబ్బంది ఇంటింటికి తిరిగి తల్లిపాల, న్యూట్రిషన్‌ఫుడ్‌లపట్ల అవగాహన కల్పించాలన్నారు. పామర్రు సీడీపీవోసి.భానుశ్రీమాట్లాడుతూ, మాతాశిశుమరణాల తగ్గించడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమన్నారు. దానికి అనుగుణంగా అన్నిశాఖల సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రభుత్వ లక్ష్యసాధనకు కృషినందించాలన్నారు. గర్భిణులకు 10నుంచి12కేజీల వరకు బరువు పెరగాల్సిన అవశ్యకతను వివరించి,తీసుకోవాల్సిన పౌష్టికాహారాన్ని సూచించారు.ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీడీవో కె.జ్యోతి, ఈవోపీఆర్‌డీ కిషోర్, ఐదుమండలాలకు చెందిన అంగన్వాడీకేంద్రాల సూపర్‌వైజర్లు, కేంద్రాల నిర్వహకులు,పాల్గొన్నారు.

గుడివాడ : తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమని ఐసీడీఎస్ అధికారిణి విజయఫ్లారెన్స్ పేర్కొన్నారు. స్థానిక పెద్ద ఎరుకపాడులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం గర్భిణీ, బాలింతలకు ఆహార అలవాట్లపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఅంగన్వాడీల్లో ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించనున్నామన్నారు. బాలింతలు, గర్భిణులు ఆహారం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలింతలు మొదటి ఆరు నెలలు వరకు బిడ్డకు తల్లిపాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయంతి, రాగవేణి, కార్యకర్తలు ప్రమీలారాణి, నవ్య, ఎం.లలితమణి, భవానీ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారిణి విజయఫ్లారెన్స్


గతంలో వంతెనకు ఇరువైపులా నిర్మించిన ఇనుప గడ్డర్లు


ధ్వంసమైన ఇనుపవంతెన

ఇనుప వంతెనకు మరమ్మతులు చేయించరూ...!

కూచిపూడి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాల రాకపోకలతో చినముత్తేవిలోని ఐనంపూడి డ్రెయిన్‌పై నిర్మించిన ఇనుప వంతెన ధ్వంసమవుతున్నా అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోవటం లేదు. గ్రామంలో ఐనంపూడి డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన కూలిపోవటంతో ఏడాదిన్నర క్రితం తాత్కాలిక (ఇనుప) వంతెన నిర్మించారు. తేలికపాటి వాహనాలు మాత్రమే వెళ్లే విధంగా వంతెనకు ఇరువైపులా ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కొందరు ఇనుప గడ్డర్లు తొలగించి వంతెనపై భారీ వాహనాలతో ఇసుక, బుసక, కంకర వంటి వాటిని యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. దీంతో వంతెన దెబ్బతిని ఫ్లాట్ ఫామ్ రేకులు ధ్వంసమవ్వటమే కాకుండా వంతెన ఊగిపోతుందని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా వంతెనపై నుంచి భారీ వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవటంతోపాటు దెబ్బతిన్న ఫ్లాట్ ఫారమ్ రేకులు పునరుద్ధరించాలని కోరుతున్నారు.


సంతకాలు సేకరిస్తున్న భవిష్యత్ భద్రతా దళ సభ్యులు

రైల్వేగేటును విస్తరించాలి

గుడివాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కేటీఆర్ కళాశాల రోడ్డులోని రైల్వేగేటును విస్తరణ చేయాలని భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక భీమవరం రైల్వే గేటు వద్ద గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో సభ్యులు మహ్మద్ తాహెర్ భాషా, జి.పూర్ణచంద్రరావు, ఎం.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

తాగునీటి సరఫరా వేళల్లో మార్పు

పెడన, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చెంచుల కాలనీలోని రిజర్వాయర్ నుంచి 7, 8, 9, 11 వార్డులకు మంచినీరు సరఫరా చేసే వేళల్లో మార్పు చేసినట్టు కమిషనర్ ఎం.గోపాలరావు తెలిపారు. ఆయా వార్డుల్లో ఇంతకు ముందు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు మంచినీరు సరఫరా చేసేవారమన్నారు. శుక్రవారం నుంచి ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు మంచినీరు అందిస్తామని, వేసవి దృష్ట్యా ఈ మార్పు చేశామని తెలిపారు. పెడన రక్షిత మంచినీటి పథకానికి రా వాటర్ సరఫరా చేసే తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీటి నిల్వలు అడుగంటినందున కొద్ది రోజులపాటు ప్రజలు కాచి చల్లార్చిన మంచినీటిని మాత్రమే తాగాలని కమిషనర్ సూచించారు.

కవితకు పవన్‌ను విమర్శించే హక్కులేదు

● జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవితకు లేదని జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. హిందీ భాష జాతీయ భాషగా అందరికీ తెలిసిందే అని, జాతీయ భాషను గౌరవించాలని డిప్యూటీ సీఎం చెప్పారని అన్నారు. అవినీతి ఊబిలో కూరుకుపోయిన ఎమ్మెల్సీ కవిత తాను కూడా ఏదో ఒక విమర్శ చేసి పత్రికలకు ఎక్కాలనే తాపత్రయంతో పవన్‌పై విమర్శలు చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో త్రిభాషా సూత్రం పాఠశాలల్లో అమలు జరుగుతోందన్నారు. ద్వితీయ భాషగా హిందీని పాఠశాలల్లో అమలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ నాగబాబు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తే మాజీ మంత్రి పేర్ని నానీ అవాకులు, చెవాకులు పేలారని, అప్పట్లో ఎమ్మెల్యే హోదాలో ఉన్న పేర్ని నానీ తన కుమారుడు కిట్టును ప్రభుత్వ అధికార కార్యక్రమాలను పంపారని అన్నారు. ఆ సంగతిని పేర్ని నానీ మర్చిపోయారా..అని నిలదీశారు. ఎవరి పార్టీల నాయకులను వారు అధికారంలో ఉండగా గౌరవించుకోవడం తప్పులేదన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



గ్యారేజీ వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

అవనిగడ్డ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కరించడంపై యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిరసనగా గురువారం మధ్యాహ్నం అవనిగడ్డ డిపో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగుల సంఘ జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.రమేష్ ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 మందికి పైగా ఉద్యోగులు భోజన సమయంలో ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. రీజనల్ నాయకులు ఎస్వీ నాగేశ్వరరావు, డిపో చైర్మన్ జి.ఆర్.ఎల్.వి.నారాయణ, గ్యారేజీ అధ్యక్ష, కార్యదర్శులు పి.చింతయ్య, పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భవతుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి



పౌష్టికాహారాన్ని అందిస్తున్న గోపు సత్యనారాయణ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గర్భవతులు, బాలింతల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అంగన్వాడీ సిబ్బందికి తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ సూచించారు. బందరు మండలం కానూరు అంగన్వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గర్భవతులు, పిల్లలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

ఆకులమన్నాడులో పౌష్టికాహార వారోత్సవాలు

గూడూరు: ఆకులమన్నాడు పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం 7వ పౌష్టికాహార వారోత్సవాలు సర్పంచ్ మొహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పౌష్టికాహారంపై గర్భవతులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు కోళ్ల లక్ష్మణరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషశ్రీ పాల్గొన్నారు.

గర్భవతులు, బాలింతలకు అవగాహన

ఘంటసాల: శ్రీకాకుళం పంచాయతీ శివారు శీలంవారిపాలెం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భవతులకు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.మేరీ అవగాహన కల్పించారు. ఆరు నెలల వరకు తల్లిపాలు శిశువుకు పట్టించాలని మేరీ సూచించారు. తర్వాత అనుబంధ పోషకాహారం, బాలామృతాన్ని అందించాలని సూచించారు. అంగన్వాడీ కార్యకర్త ఎ.శివరాణి, తల్లులు పాల్గొన్నారు.

కాల్వల మరమ్మతులు సకాలంలో చేయించండి



డీఆర్వో కె.చంద్రశేఖరరావుకు వినతిపత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు

మచిలీపట్నం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఇబ్బంది పడకుండా పంటకాలువలు, డ్రెయినేజీలు, కాలువల నిర్వహణ (ఓ అండ్ ఎం)పనులు సకాలంలో చేయించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా విభాగం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం డీఆర్వో కె.చంద్రశేఖరరావుకు వారు వినతిపత్రం అందించారు. ఖరీఫ్ సాగు నిమిత్తం సకాలంలో సాగునీటిని విడుదల చేయాలని, ఈ వేసవిలో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, నాచు, తూడు, కిక్కిసలను తొలగించాలని, కాలువగట్లు బలహీనంగా ఉన్న చోట్ల గట్లను బలోపేతం చేయాలని వారు కోరారు. బందరు, ఏలూరు, రైవస్, కేఈబీ కాలువలు విజయవాడ నుంచి వస్తున్నాయని, కాలువగట్లపై నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు వ్యర్థాలను నేరుగా ఈ కాలువల్లోకి విడుదల చేస్తున్నారని, దీంతో కలుషితమైన నీటినే జిల్లాలోని దిగువప్రాంతాల ప్రజలు తాగునీటిగా వినియోగిస్తున్నారని వారు వివరించారు. కాలువగట్లపై ఆక్రమణలను తొలగించాలని అర్జీలో పేర్కొన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల దుర్గామల్లేశ్వరరావు, బందరు మండల అధ్యక్షుడు దేవనబోయిన ప్రసాద్, మొవ్వ మండల అధ్యక్షుడు కొలుసు కుటుంబరావు, గూడూరు మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాసరావు, పామర్రు మండల అధ్యక్షుడు డి.బసవయ్య, కె.సూర్యకళ పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయ అనువంశిక

ధర్మకర్తగా పెల్లూరి వెంకటేశ్వరరావు



ప్రమాణస్వీకారం చేస్తున్న పెల్లూరి వెంకటేశ్వరరావు

మోపిదేవి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పెదప్రోలు భూనీలా సమేత చెన్నకేశవ స్వామి ఆలయ అనువంశిక ధర్మకర్తగా గ్రామానికి చెందిన పెల్లూరి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. గురువారం ఆలయ ప్రాంగణంలో వెంకటేశ్వరరావును ధర్మకర్తగా దేవదాయశాఖ మచిలీపట్నం డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. సర్పంచ్ పోలిమేట్ల ఏసుబాబు, ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

తీర ప్రాంత గ్రామాల్లో పోలీసు గస్తీ



సముద్రంలో గస్తీ కాస్తున్న ఆర్మ్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, సిబ్బంది

కోడూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాలకాయితిప్ప మెరైన్ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం సివిజల్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మచిలీపట్నం ఆర్మ్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 50 మంది పోలీసు సిబ్బంది బుధ, గురువారాల్లో తీరప్రాంత గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. మెరైన్ సీఐ సురేష్ రెడ్డి, అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది, మెరైన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల ఊరేగింపు



కోనేరుసెంటర్‌లో..



జోస్యుల వారితోటలో..

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జోస్యులవారితోట రామాలయంలో స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం మేళతాళాలతో ట్రాక్టర్‌పై సీతారామలక్ష్మణులను ఊరేగించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వర్రె వెంకట శ్రీహరిబాబు, ఉపాధ్యక్షుడు పుప్పాల శివకుమార్, కార్యదర్శి దూసనపూడి వెంకట సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ పుప్పాల బాల అంజనేయ సూర్యప్రసాద్, కోశాధికారి కొలసాని శ్రీహరి పాల్గొన్నారు.

పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో..

కోనేరుసెంటర్‌లో నిర్వహిస్తున్న వసంత నవరాత్రోత్సవాలు ముగిసిన దృష్ట్యా గురువారం సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భద్రాద్రి రామాలయంలో స్వామికి ప్రత్యేక అర్చనలు

సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా మచిలీపట్నంలోని భద్రాద్రి రామాలయంలో గురువారం సాయంత్రం స్వామికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శిరీష పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ తలారి లీలావతి

సేవలు స్ఫూర్తిదాయకం



సంతాపం తెలుపుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మాజీ కౌన్సిలర్ తలారి లీలావతి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. గురువారం తలారి లీలావతి మృతికి సంతాపం ప్రకటిస్తూ మునిసిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఆమె వాయిదా వేశారు. లీలావతి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సేవలందించారన్నారు. కార్పొరేటర్లు లంకా సూరిబాబు, అస్గర్, మరకాని సమతాకీర్తి, అన్నం ఆనంద్, దేవరపల్లి అనిత, దింటకుర్తి సుధాకర్‌లు పాల్గొన్నారు. లీలావతి సేవలపై ప్రసంగించారు. కౌన్సిల్ సమావేశం 15వ తేదీకి వాయిదా వేసినట్లు మేయర్ తెలిపారు.



ప్రభుదాసును సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

సర్వేయర్ ప్రభుదాసుకు సన్మానం

పెడన, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జాతీయ సర్వే దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ ప్రభుదాసును సన్మానించారు. ఆర్ఐ విజయలక్ష్మి, సర్వే డీటీ సల్మా, ఎన్నికల డీటీ నరసింహారావు పాల్గొన్నారు.

పంచాయతీలకు నూతన కార్యదర్శుల నియామకం

కోడూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతుల్లో భాగంగా మండలంలోని ఐదు పంచాయతీలకు నూతన కార్యదర్శులు నియమితులయ్యారు. లింగారెడ్డిపాలెం, మాచవరం గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కడవకొల్లు సుధీర్, కొక్కిలిగడ్డ ఏడుకొండలు గ్రేడ్-3 పదోన్నతి పొంది పిట్టలంక, ఉల్లిపాలెం పంచాయతీ కార్యదర్శులుగా గురువారం బాధ్యతలు చేపట్టారు. హంసలదీవి, కోడూరు-2, వి.కొత్తపాలెం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న కమ్మిలి లీలాప్రియాంక, శివకుమార్, యలవర్తి తనుజాలు గ్రేడ్-4 పదోన్నతి పొంది రామకృష్ణాపురం, వి.కొత్తపాలెం, మాచవరం పంచాయతీ కార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతి పత్రాలను కార్యదర్శులు ఎంపీడీవో సుధా ప్రవీణ్‌కు అందించారు.

ఐటీడీపీ కార్యకర్త కిరణ్‌పై చర్యలు తీసుకోవాలి

అవనిగడ్డ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సతీమణి భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ కార్యకర్త కిరణ్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఆ పార్టీ జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, చింతలపూడి బాలభాస్కరరావు, నలుకుర్తి పృథ్వీరాజ్, కృష్ణారావు తదితరులు ఎస్ఐ శ్రీనివాస్‌ను కలిసి కిరణ్‌పై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

లంకమ్మ ప్రభ మహోత్సవం విజయవంతం చేయండి

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డలో ఈనెల 12వ తేదీన జరుగనున్న లంకమ్మ వార్షిక జాతర మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రభ బండి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పులిగడ్డకు చెందిన జనసేన నాయకుడు మండలి దయాకర్ గురువారం ఒక ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చారు. 12వ తేదీ రాత్రి 7 గంటలకు లంకమ్మ మాన్యం నుంచి ఊరేగింపు జరుగుతుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

కూటమి ప్రభుత్వంలో రహదారులకు మహర్దశ



ఉల్లిపాలెం నుంచి వేణుగోపాలపురం వరకు నిర్మించిన రోడ్డును పరిశీలిస్తున్న కూటమి నాయకులు

కోడూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గత రహదారులకు మహర్దశ లభించిందని జనసేన మండల అధ్యక్షుడు మర్రే గంగయ్య అన్నారు. గురువారం ఉల్లిపాలెం నుంచి వేణుగోపాలపురం వరకు నాలుగు కిలోమీటర్ల మేర నిర్మించిన నూతన రహదారి పనులను స్థానిక నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. రహదారి దాదాపు పూర్తయిందని, మధ్యలో కల్వర్టుల వద్ద ఉల్లిపాలెం లింగన్నకోడుపై వంతెన నిర్మాణం జరగాల్సి ఉందని తెలిపారు. కొండవీటి సునీత, కోట రాంబాబు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

మోపిదేవి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాలు వినియోగించడంలో ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. రావివారిపాలెంలో పది రోజులుగా నిర్వహిస్తున్న బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ప్రత్యేక ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం గురువారం ముగింపు సందర్భంగా ఆహార పదార్థాల్లో జరిగే కల్తీపై గ్రామస్థులు, విద్యార్థులకు గోపాలకృష్ణ అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆర్గనైజర్ డాక్టర్ ఎం.సంధ్య, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.అపర్ణ, గ్రామస్థులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నంగేగడ్డలో మంచినీటి పంపు ఏర్పాటు

నాగాయలంక, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నంగేగడ్డ గ్రామస్థుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు పారిశ్రామికవేత్త, టీడీపీ ఎన్ఆర్ఐ నాయకుడు బొబ్బా గోవర్ధన్ చొరవ చూపారు. గురువారం సొంత ఖర్చులతో బోరు ఏర్పాటు చేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు తాడేపల్లి పాపారావు, ఈమని నాగార్జున, అమ్ముల సుబ్బారావు, మిర్యాల రామాంజనేయులు తదితరులు గోవర్ధన్‌కు గ్రామస్థుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రెవెన్యూ సేవలకు ప్రభుత్వం

నిర్ణయించిన రుసుమే చెల్లించాలి

కోడూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సేవల కోసం దరఖాస్తు చేసుకునే వారు ప్రభుత్వం నిర్ణయించిన రుసుము మాత్రమే చెల్లించాలని తహసీల్దార్ శ్రీను నాయక్ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని సచివాలయాల వద్ద మీ సేవ కేంద్రాల వద్ద పట్టాదారు పాస్ బుక్‌ల కోసం అడంగల్ కరెక్షన్ కోసం భూముల రీ సర్వే కోసం ఆర్వోఆర్ వంటి సేవల కోసం దరఖాస్తు చేసుకునేవారు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములే చెల్లించాలన్నారు. అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

పెడన రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వేమన నాగరాజు(45) అకాల మరణం చెందాడు. ఉప సర్పంచ్ కాగిత లక్ష్మీ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేలు మట్టి ఖర్చుల నిమిత్తం అందించారు. పేదరికంలో ఉన్న నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చల్లపల్లిలో వర్షం



చల్లపల్లిలో కురుస్తున్న వర్షం

చల్లపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భానుడి ప్రచండాగ్నితో ఓ వైపు ప్రజలు తల్లడిల్లుతుంటే చల్లపల్లిలో గురువారం మధ్యాహ్నం మండుటెండలోనే ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. కొద్దిసేపే వర్షం కురిసినప్పటికీ ఆ తర్వాత వాతావరణం పూర్తిగా చల్లబడింది. కొద్దిసేపు గాలులు లేకుండా ఉక్కబోసినప్పటికీ, సాయంత్రం నుంచి చల్లటి గాలులు వీచాయి.



మధుమేహంపై అశ్వినీకుమార్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేయూ ఉపకులపతి కూన రాంజీ

మధుమేహ నియంత్రణకు

ఆహార నియమాలు పాటించాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మధుమేహంతో బాధపడేవారు తగిన వ్యాయామం చేస్తూ ఆహార నియమాలు పాటించాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కూన రాంజీ అన్నారు. త్రిపుర సుందరీ ఫౌండేషన్ 25 వసంతాలు నిండిన సందర్భంగా గురువారం పరాసుపేట సెంటర్‌లో ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాంజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్యుడు అశ్వనీకుమార్ రచించిన గర్భిణీ స్త్రీలలో మధుమేహం అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ కౌన్సిలర్ కొట్టె వెంకట్రావు, త్రిపుర సుందరీ ఫౌండేషన్ కార్యదర్శి, న్యాయవాది వింజమూరి శివరాం పాల్గొన్నారు. ఉపకులపతి రాంజీ, వైద్యులను కొట్టే వెంకట్రావు సత్కరించారు.

రైతుల ఖాతాల కంప్యూటరీకరణ

పెడన రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పెడన జయలక్ష్మి వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రైతుల ఖాతాలను పూర్తి కంప్యూటరీకరణ చేశారు. జిల్లా సహకార శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి బ్యాంక్‌ను సందర్శించారు. సంఘంలో జరిగే లావాదేవీల్లో పొరపాట్లు జరుగకుండా చూడాలన్నారు. అభివృద్ధి పనులను పరిశీలించారు. రైతులకు అందుతున్న సేవలపై సీఈవో ఎం.రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

30లోగా పన్నులు చెల్లిస్తే 5శాతం రిబేటు

పెడన, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఇళ్ల పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు ఈనెల 30వ తేదీలోగా ఏకమొత్తంగా చెల్లించిన వారికి ప్రభుత్వం పన్ను మొత్తంలో 5 శాతం రిబేటు ఇచ్చిందని కమిషనర్ ఎం.గోపాలరావు తెలిపారు. సెలవు దినాల్లోనూ పురపాలక సంఘ కార్యాలయంలో పన్నులు చెల్లించవచ్చని ఆయన పేర్కొన్నారు.

అయ్యప్ప భక్తుల బాసట



డిపాజిట్‌ను అందిస్తున్న శ్రీధర్మశాస్త్ర ఆలయ ప్రతినిధులు

చల్లపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): శబరిమలలో అకాల మరణం చెందిన అయ్యప్పదీక్షాపరుడు ఆకుల విజయ్ కుటుంబానికి అయ్యప్ప భక్తులు అండగా నిలిచారు. శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయం అధ్యక్షుడు పుప్పాల సుబ్బారావు, ఉపాధ్యక్షుడు యార్లగడ్డ శివయ్య, రావులపల్లి పండు గురుస్వాములు వారి అయ్యప్పపీఠాల పరిధిలోని శిష్యులందరూ కలిపి రూ.లక్ష సమీకరించి విజయ్‌స్వామి కుమార్తె పేరున డిపాజిట్ చేశారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను మృతుని భార్యకు అందజేశారు. గురుస్వాములు మత్తి నాగేంద్రం, కస్తూరి వెంకట కోటేశ్వరరావు, బడే శివరామకృష్ణ, లంక ప్రసాద్, బళ్ల మధు పాల్గొన్నారు.

కంకటావ పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్



డ్రైవ్‌లో పాల్గొన్న డీఎస్వో పార్వతి తదితరులు

గూడూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కంకటావ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(మెయిన్)లో గురువారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. డీఎస్వో పార్వతి, విద్యాశాఖాధికారులు శేఖర్‌సింగ్, పి.సుబ్రహ్మణ్యం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గళ్ల దుర్గారాణి, ప్రధానోపాధ్యాయుడు జి.నవీన్‌బాబు, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.